మీరే
చదువరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త
వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU
దినపత్రిక

Published from Jagitial
www.evarthalu.com

శనివారం
SATURDAY
7-2-2026

జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00
సంపుటి: 1 Volume:1 || సంచిక: 219 Issue: 219

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు మాఘ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:49 సూర్యాస్తమయం - సా. 6:10 తిథి షష్ఠి రా. 2:56ం వరకు తరువాత సప్తమి సంస్కృత వారం స్థిర వాసరః నక్షత్రం చిత్తా రా. 2:25ం వరకు తరువాత స్వాతి యోగం శూల రా. 11:40 వరకు కరణం గరజి మ. 2:05 వరకు వనిజ రా. 2:56ం వరకు వర్జ్యం ఉ. 9:04 నుండి ఉ. 10:48 వరకు దుర్ముహూర్తం ఉ. 8:20 నుండి ఉ. 9:06 వరకు రాహుకాలం ఉ. 9:40 నుండి ఉ. 11:05 వరకు యమగండం మ. 1:55 నుండి మ. 3:20 వరకు గుళికాకాలం ఉ. 6:49 నుండి ఉ. 8:15 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:13 నుండి ఉ. 6:01 వరకు అమృత ఘడియలు రా. 7:53 నుండి రా. 9:38 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:07 నుండి మ. 12:53 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున




ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రపంచంలో మరో సంచలనం.. ఆంత్రోపిక్. ఇది ఒక ఏఐ కంపెనీ. ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన స్టార్టప్. దీని ఆర్థిక బలం ఒక ఎత్తైతే, దాని పనితీరు మరో ఎత్తు. ఎంతలా అంటే.. ఐటీ రంగాన్ని అతలాకుతలం చేసి, ఐటీ రంగాన్ని పూర్తిగా ఆక్రమించేసేంత. దీని దెబ్బకు మహామహులైన టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి దిగ్గజ కంపెనీల షేర్లు పాతాళానికి పడిపోయాయి. ఈ కంపెనీ ఏం చేసింది? ఐటీ కంపెనీల షేర్లు ఎందుకు పడిపోతున్నాయి? సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు ఎసరు పెడుతుందా? సాఫ్ట్‌వేర్ రంగంలో ఏయే స్థానాలను ఇది ఆక్రమిస్తుంది? అన్న అనేక ప్రశ్నలకు సమాధానాలతో 'ఈవార్తలు' స్పెషల్ స్టోరీ.

# "ఆంత్రోపిక్.." ఐటీ ఆగం!

## ఐటీ మార్కెట్‌ను కుదిపేస్తున్న కంపెనీ

ఎర్రర్ వస్తే బగ్‌ను వెతికే పనిలేదు..
అది ఎక్కడ దాకున్నా పట్టేస్తుంది..!
కోడ్ మార్చేందుకు డెవలపర్‌తో పని లేదు..
టెస్టింగ్ టీంతో అసలే అవసరం లేదు..
వీళ్లందరి పని నేనే చేస్తానంటోంది..
ఆంత్రోపిక్ వారి 'క్లాడ్ కోవర్క్'!!
పైగా, ఓ సారి చెక్ చేసుకోండని సలహా!
ఇప్పుడిదే ఐటీలో వణుకు పుట్టిస్తోంది!
లక్షల టెకీల జాబ్స్‌కు ఎసరు పెట్టేస్తోంది!
డెవలపర్లు, టెస్టింగ్ టీం, సేల్స్, లీగల్..
ఇలా అన్ని పనులు తానే చేస్తానంటోంది!!



'క్లాడ్ కోవర్క్' ప్లగిన్లతో ప్రకంపనలు

సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను మించి పనులు

టెకీలకు సవాల్ విసిరే ఏఐ సాధనం

బగ్‌ను పట్టి సరిచేసేంత వర్క్‌ఫ్లో

అప్‌డేట్ కాకపోతే పెను ముప్పు

(ఈవార్తలు-టెక్ బ్యూరో)

అసలు విషయానికి వస్తే.. ఆంత్రోపిక్ సంస్థను 2021లో డారియో అమోడెయ్, ఆయన సోదరి డానియెలా అమోడెయ్ స్థాపించారు. వీరిద్దరు ఒకప్పుడు చాట్‌జీపీటీని సృష్టించిన 'ఓపెన్ ఏఐ'లో కీలక బాధ్యతల్లో ఉండేవారు. ఓపెన్ ఏఐ క్రమంగా లాభాపేక్ష వైపు వెళ్తోందని, ఏఐ భద్రత పట్ల శ్రద్ధ తగ్గించిందని భావించి వీరు బయటకు వచ్చారు. కేవలం తెలివైనది మాత్రమే కాదు, మానవ విలువలకు అనుగుణంగా ఉండే 'సురక్షితమైన ఏఐ'ని అభివృద్ధి చేయడం కోసం వీళ్లు కంకణం కట్టుకున్నారు. దీనికోసం వీరు 'కాన్‌స్టిట్యూషనల్ ఏఐ' అనే తరువాయి 2 వ పేజీలో...







విశ్వవిజేతగా భారత్-అండర్ 19

100 పరుగుల తేడాతో భారీ విక్టరీ

చుక్కలు చూపించిన వైభవ్ సూర్యవంశీ

# పిలగాండ్లు.. ప్రపంచ వీరులు!

ఫైనల్లో ఇంగ్లండ్ అండర్ 19 చిత్తు చిత్తు

ఆరో టైటిల్‌ను ముద్దాడిన టీమిండియా

దుమ్ముదులిపాడు అంటే చీప్..
వీరవిహారం అన్నా సరిపోదు..
ఊచకోత పదమూ తక్కువే..
ఆకాశమే హద్దు అంటే.. కాస్త బెటర్
చుక్కలు చూపించాడు అంటే.. ఇంకాస్త బెటర్
వెన్నులో వణుకు పుట్టించాడంటే.. ఓ లెక్క!
బ్యాటుతో ఉగ్రతాండవం అంటే.. పర్‌ఫెక్ట్
అది కదా వైభవం.. అది కదా సూర్యప్రతాపం..
వైభవ్ సూర్యవంశీ.. అసలుసిసలైన వీరత్వం!!

## బంగారం-వెండి ధరలు


| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,371 |
| వెండి (గ్రాము): | రూ.280 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,666 |

# ఇదే లాస్ట్ చాన్స్!

## మళ్లీ మళ్లీ చెప్పేది ఉండదు

## 3 వారాల్లో నిర్ణయం తీసుకోండి

### జంపింగ్‌లపై స్పీకర్‌కు సుప్రీం అల్టిమేటం



ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలన్న పిటిషన్‌పై తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు సుప్రీంకోర్టు చివరి అవకాశమిచ్చింది. ఈ అంశంపై మూడు వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని స్పష్టమైన గడువు విధించింది. నిర్ణీత గడువులోగా నిర్ణయం ప్రకటించకపోతే కోర్టు ధిక్కరణగా పరిగణించాల్సి ఉంటుందని తీవ్రంగా హెచ్చరించింది.

న్యూఢిల్లీ: పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అగస్టీన్ జార్జ్‌ల ధర్మాసనం ఇవాళ విచారణ జరిపింది. అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవడంలో ఇప్పటికే స్పీకర్‌కు చాలా సమయం ఇచ్చామని గత విచారణలో వ్యాఖ్యానించిన కోర్టు, ఈసారి మరింత కఠినంగా వ్యవహరించింది. విచారణ సందర్భంగా ప్రభుత్వం తరఫున న్యాయవాది అభిషేక్ సింఘ్వీ తరువాయి 2 వ పేజీలో...

# పేలిన శరీరాలు!

## పాకిస్తాన్‌లో ఆత్మాహుతి దాడి

### 68 మంది దుర్మరణం.. వందల సంఖ్యలో క్షతగాత్రులు


### శుక్రవారం ప్రార్థనల అనంతరం ఘటన

పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో మరోసారి భారీ పేలుడు సంభవించింది. శుక్రవారం జుమా ప్రార్థనల అనంతరం ఓ షియా మసీదు లక్ష్యంగా జరిగిన బాంబు పేలుళ్లలో 68 మంది పాకిస్తాన్ పౌరులు అక్కడికక్కడే దుర్మరణం చెందగా 169 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఇస్లామాబాద్‌లోని ఆగ్నేయ ప్రాంతమైన తర్లాయ్ కలాన్‌లోని ఖదీజతుల్ కుబ్రా మసీదులో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ బాంబు బ్లాస్ట్ గురించి సమాచారం అందుకున్న అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. భద్రతా బలగాలు సహాయక చర్యలు మొదలు పెట్టాయి.



ఇస్లామాబాద్: క్షతగాత్రులను దగ్గరలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. నగరంలోని ప్రధాన ఆస్పత్రుల్లో అధికారులు అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. అయితే ఈ బాంబ్ బ్లాస్ట్‌కు సంబంధించి ఇప్పటివరకు బాధ్యులుగా ఎవరు ప్రకటించలేదు. బాంబు బ్లాస్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు విచారణను వేగవంతం చేశారు. ఇది ఆత్మాహుతి దాడి అయి ఉండవచ్చు అని ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. మసీదు ప్రధాన ద్వారం వద్ద దుండగుడు తనుకు తాను పేల్చుకుని ఉండవచ్చని అనుమానిస్తున్నారు. దాని వల్లే ఇంత పెద్ద ఎత్తున ప్రాణ నష్టం జరిగింది ఉంటుందని భావిస్తున్నారు. మరోవైపు పాక్ సైన్యం 'ఇంటెలిజెన్స్ ఆధారిత తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



సర్జరీ అవసరం లేకుండా కిడ్నీ రాళ్లను కరిగించే బియ్యపు గింజంత అయస్కాంత సాఫ్ట్ రోబోను కెనడా శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఆ రోబో కిడ్నీ రాళ్ల వద్దకు చేరుకోగానే, కిడ్నీరాళ్లను కరిగించే యూరియాస్ ఎంజైమ్‌లను విడుదల చేస్తాయని యూనివర్సిటీ ఆఫ్ వాటర్లూ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.




# వడ్డీరేట్లు యథాతథం

## రెపో రేటును యథాతథంగా ఉంచిన ఆర్బీఐ

### 5.25 శాతంగా కొనసాగనున్న వడ్డీ రేటు.. ద్రవ్యోల్బణం అదుపులోనే: ద్రవ్య పరపతి కమిటీ

న్యూఢిల్లీ: కీలక వడ్డీ రేట్లను భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) యథాతథంగా ఉంచింది. పాలసీ రెపో రేటును ప్రస్తుతమున్న 5.25 శాతం వద్దే కొనసాగించాలని ద్రవ్య పరపతి కమిటీ (ఎంపీసీ) ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ప్రకటించారు. దీంతో పాటు తమ 'న్యూట్రల్ మానిటరీ పాలసీ' వైఖరికే కట్టుబడి ఉన్నట్లు -2 వ పేజీలో...



# బిట్ కాయిన్.. కొల్లాప్స్!

### క్రిప్టో కరెన్సీ భారీ పతనం..12 శాతం.. 65,000 డాలర్ల దిగువకు

ప్రపంచంలోనే అతిపెద్ద క్రిప్టోకరెన్సీగా పేరున్న బిట్ కాయిన్ విలువ శుక్రవారం భారీగా పతనమైంది. ఒకే రోజు దాదాపు 12 శాతం పడిపోయి, 65,000 డాలర్ల దిగువకు చేరింది. ఏడాది కాలంగా ఇదే అత్యల్ప స్థాయి.

న్యూఢిల్లీ:ట్రంప్ అధికారం చేపట్టిన తర్వాత ఈ స్థాయిలో పడిపోవడం కూడా ఇదే మొదటిసారి. క్రిప్టో మార్కెట్లో భయాందోళనల నేపథ్యంలో అమ్మకాల ఒత్తిడుల మూలంగా బిట్ కాయిన్ విలువ పడిపోయినట్లు అంచనా. ఏడాది విలువ ప్రకారం 33.82 శాతం తగ్గింది. 24 గంటల్లో 9.84 శాతం పడిపోయింది. 1 బిలియన్ తరువాయి 2 వ పేజీలో...

# ఓటీపీ స్కాం.. 25 వేల పరిహారం!




## కీలక నిర్ణయం దిశగా ఆర్బీఐ

న్యూఢిల్లీ: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కస్టమర్ భద్రతను ఇంకా బలంగా చేయాలనే దిశగా కీలక నిర్ణయాలు ప్రకటించింది. చిన్న మొత్తాల ఫ్రాడ్ బాధితులకు వెంటనే ఊరట ఇవ్వడమే లక్ష్యంగా కొత్త చర్యలు తీసుకొస్తున్నట్లు తెలిపింది. చిన్న ఫ్రాడ్ కేసుల కోసం కొత్త కంపెన్సేషన్ ఫ్రేమ్‌వర్క్ సిద్ధం చేసింది. ఫ్రాడ్ కేసుల్లో దాదాపు 65 శాతం కేసులు రూ.50,000 కంటే తక్కువ మొత్తాలతోనే ఉంటాయని సెంట్రల్ బ్యాంక్ గమనించింది. ఈ నేపథ్యంలో 'చిన్న ఫ్రాడ్‌లకు కంపెన్సేషన్ ఇచ్చే ఫ్రేమ్‌వర్క్ తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు
7.2.2026

మేషం: చేపట్టిన వ్యవహారాలలో మిత్రుల సహాయ సహకారాలు అందుతాయి. ఆరోగ్యం విషయంలో కొంత శ్రద్ధ వహించాలి. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది. దూర ప్రయాణ సూచనలున్నవి. సోదరుల నుంచి ఆర్థిక సహాయం అందుతుంది. వృత్తి ఉద్యోగాలు సంతృప్తిగా సాగుతాయి. వ్యాపారాలలో తొందరపాటు పనిచేయదు.

వృషభం: దీర్ఘకాలిక ఒత్తిడి పెరుగుతుంది. వృధా ఖర్చులు చేస్తారు. దూర ప్రయాణాలు వాయిదా పడతాయి. కుటుంబ సభ్యులతో వివాదాలు కలుగుతాయి. వృత్తి వ్యాపారాలలో పెట్టుబడుల విషయంలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. కుటుంబ పెద్దల ఆరోగ్యవిషయాలలో అప్రమత్తంగా వ్యవహరించాలి.

మిధునం: నూతన కార్యక్రమాలను ప్రారంభించి లాభాలను అందుకుంటారు. కుటుంబ సభ్యులతో కీలక విషయాల గురించి చర్చలు జరుగుతాయి. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. వృత్తి వ్యాపారాలు అనుకూలంగా సాగుతాయి. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి.

కర్కాటకం: ఆర్థిక లావాదేవీలు ఆశాజనకంగా ఉంటాయి. భాగస్వామ్య వ్యాపారాలు లాభాలను అందుకుంటాయి. కొన్ని వ్యవహారాలలో కుటుంబ సభ్యుల సహాయ సహకారాలు ఉంటాయి. నిరుద్యోగులకు నూతన అవకాశాలు లభిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో శ్రమకు తగిన గుర్తింపు లభిస్తుంది.

సింహం: ఆర్థిక పరిస్థితి కొంత అనుకూలంగా ఉంటుంది. దూర ప్రాంతాల వారి నుండి అందిన సమాచారం ఆసక్తి కలిగిస్తుంది. బంధుమిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. వ్యాపార వ్యవహారాలు వేగవంతం చేస్తారు. వృత్తి ఉద్యోగాల విషయంలో శుభవార్తలు అందుతాయి.

కన్య: చేపట్టిన వ్యవహారాలలో ఆటంకాలు ఎదురైనా ధైర్యంగా పనులను పూర్తి చేస్తారు. అనుకోకుండా చేసిన ప్రయాణాలు లాభసాటిగా ఉంటాయి. క్రయ విక్రయాలలో నూతన లాభాలు పొందుతారు. కుటుంబ సభ్యులతో శుభకార్యాలలో పాల్గొంటారు. ఉద్యోగమున ఉన్నతి కలుగుతుంది.

తుల: వృత్తి ఉద్యోగాలలో ఆశించిన స్థానాలు ఉంటాయి. వ్యాపారపరంగా ఎదురైనా అవరోధాలను అధిగమిస్తారు. సంతానం విద్యా విషయాలలో నూతన అవకాశాలు లభిస్తాయి. ఆర్థిక వ్యవహారాలు ఆశాజనకంగా ఉంటాయి. దూర ప్రాంతాల మిత్రుల నుండి కీలక విషయాలు సేకరిస్తారు.

వృశ్చికం: భూ సంబంధిత క్రయ విక్రయాలలో నూతన ఒప్పందాలు చేసుకుంటారు. దీర్ఘకాలిక వివాదాలు తొలగి మానసిక ప్రశాంతత పొందుతారు. వృత్తి వ్యాపారాలలో స్వల్ప లాభాలు అందుతాయి. సోదర వర్గం వారి నుండి ఊహించని ఆర్థిక సహాయం అందుతుంది.

ధనస్సు: విలువైన గృహోపకరణాలు ఖ చేస్తారు. దీర్ఘకాలిక ఋణ ఒత్తిడి నుండి బయటపడతారు. విందు వినోద కార్యక్రమాలు ఆహ్వానాలు అందుతాయి. వృత్తి ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు పొందుతారు. వ్యాపారాలలో ఊహించని లాభాలు అందుకుంటారు.

మకరం: ఉద్యోగులకు అధికారుల అనుగ్రహం కలిగి హోదాలు పెరుగుతాయి. చాలాకాలంగా వేధిస్తున్న సమస్యల నుండి బయటపడతారు. సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. శత్రువుల నుండి ఊహించని ఆహ్వానాలు అందుతాయి. జీవిత భాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలను ప్రారంభిస్తారు.

కుంభం: ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నా అవసరానికి డబ్బు అందుతుంది. నిరుద్యోగులకు నూతన అవకాశాలు లభిస్తాయి. ప్రయాణాలలో పరిచయాలు పెరుగుతాయి. వృత్తి వ్యాపారాలలో కీలక నిర్ణయాలు అమలు చేస్తారు. సంతాన ఉద్యోగ వివాహ ప్రయత్నాలు అనుకూలిస్తాయి.

మీనం: వాహన కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో స్వంత ఆలోచనలను ఆచరణలో పెడతారు. చేపట్టిన పనులను సకాలంలో పూర్తి చేసి ప్రముఖుల నుండి ప్రశంసలు పొందుతారు. కుటుంబ సభ్యుల నుండి శుభవార్తలు అందుతాయి. నూతన వ్యాపార ప్రారంభానికి అవరోధాలు తొలగుతాయి.


# ఆంత్రోపిక్.. ఐటీ ఆగం!

మొదటి పేజీ తరువాయి

పద్ధతిని వాడుతున్నారు. అంటే.. ఏఐకి కొన్ని నైతిక నియమాలను నేర్పుతారు. తాజాగా, ఈ కంపెనీ.. ఒక 'క్లాడ్ కోవర్క్' పేరుతో కొన్ని కొత్త ప్లగిన్‌లను విడుదల చేసింది. ఇది కేవలం సలహాలు ఇవ్వడమే కాదు, ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ లాగా కోడింగ్ రాయడం, టెస్టింగ్ చేయడం, సేల్స్, లీగల్ పనులను స్వయంగా పూర్తి చేయగలదు. సాధారణంగా చాట్ జీపీటీ లేదా పాత క్లాడ్ వెర్షన్లు మనం అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇస్తాయి. కానీ 'క్లాడ్ కోవర్క్' ఒక అడుగు ముందుకు వేసి, మనకు బదులుగా పనులు కూడా పూర్తి చేస్తుంది. ఇది ఒక బాట్ కాదు, ఒక వర్చువల్ ఉద్యోగి. ఇది మనిషి లాగే స్క్రీన్‌ను చూడగలదు, మౌస్‌ను కదపగలదు, బటన్లను క్లిక్ చేయగలదు, కీబోర్డ్ ఉపయోగించి టైప్ చేయగలదు. అంటే మీరు దానికి ఒక పని చెబితే, అది మీ బ్రౌజర్ ఓపెన్ చేసి, సాఫ్ట్‌వేర్లను ఆపరేట్ చేసి ఆ పని ముగిస్తుంది. ఒక పని పూర్తి చేయడానికి ఏయే దశలు అవసరమో ఇది ముందే ప్లాన్ చేసుకుంటుంది. ఒకచోట తప్పు జరిగితే, దానికదే సరిదిద్దుకుని ముందుకు వెళ్తుంది. ఇది గిట్‌హబ్, స్లాక్, జీరా, వీఎస్ కోడ్ వంటి సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ టూల్స్‌తో అనుసంధానమై ఉంటుంది.

### డేటా ప్రైవసీ.. ఆంత్రోపిక్ ప్రత్యేకత

కంపెనీల రహస్య కోడ్‌ను అది తన మోడల్ ట్రైనింగ్ కోసం వాడుకోదు. తక్కువ తప్పులు చేస్తుంది. క్లాడ్ మోడల్స్ అబద్ధాలు చెప్పడం లేదా తప్పు సమాచారం ఇవ్వడం మిగతా వాటితో పోలిస్తే చాలా తక్కువ. క్లాడ్ కోవర్క్ అనేది ఐటీ రంగంలో ఒక డిజిటల్ విప్లవం. ఇది డెవలపర్లకు శత్రువు కాదు, ఒక శక్తివంతమైన కో-పైలట్. దీన్ని అందిపుచ్చుకున్న వారు ఐటీ రంగంలో రాణిస్తారు, వెనుకబడిన వారు ఇబ్బంది పడతారు. ఆంత్రోపిక్ పుట్టుక ఒక సిద్ధాంతంతో మొదలైనా, నేడు అది ప్రపంచ ఆర్థిక వ్యవస్థను శాసించే స్థాయికి చేరే అవకాశం ఉంది. సాఫ్ట్ వేర్ యాజ్ ఏ సర్వీస్ కంపెనీలకు ఇది ముప్పుగా పరిణమిస్తుందని ఇన్వెస్టర్లు భావించడంతో టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో షేర్లు నేలచూపు చూశాయి.



### ఉద్యోగాలకు ఎసరు?

**ఎలా పనిచేస్తుందంటే..**

ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఒక బగ్ వచ్చిందనుకుందాం...

**గతంలో అయితే..**

డెవలపర్ ఆ బగ్‌ను వెతకాలి. కోడ్ మార్చాలి. టెస్టింగ్ టీమ్‌కు పంపాలి.

**క్లాడ్ కోవర్క్‌తో..**

సిస్టమ్‌లో వచ్చిన ఎర్రర్‌ను అది గుర్తిస్తుంది. సంబంధిత కోడ్ ఫైల్‌ను ఓపెన్ చేసి, తప్పు ఎక్కడుందో మనిషి కంటే వేగంగా పట్టుకుంటుంది. కోడ్‌ను సరిచేసి, సరిగ్గా పనిచేస్తుందో లేదో రన్ చేసి చూస్తుంది. అంతా బాగుంటే, టీమ్ లీడర్‌కు 'నేను ఈ మార్పులు చేశాను, ఒకసారి చూడండి' అని మెసేజ్ పంపుతుంది.

ఇకపై మీరు గంటల తరబడి కోడ్ రాయాల్సిన అవసరం ఉండకపోవచ్చు. ఏఐ రాసిన కోడ్‌ను రివ్యూ చేయడం, అది కంపెనీ నిబంధనలకు అనుగుణంగా ఉందో లేదో చూడటమే ఉద్యోగి ప్రధాన బాధ్యత అవుతుంది. గతంలో 10 మంది చేసే పనిని ఇప్పుడు ఇద్దరు డెవలపర్లు ఏఐ సహాయంతో పూర్తి చేయగలరు. దీనివల్ల కంపెనీలకు ఖర్చు తగ్గుతుంది, వేగం పెరుగుతుంది. 'ప్రాంప్ట్ ఇంజనీరింగ్' మాత్రమే కాదు, ఏఐ ఆర్కెస్ట్రేషన్ అంటే అనేక ఏఐ ఏజెంట్లను ఎలా మేనేజ్ చేయాలో నేర్చుకోవడం తప్పనిసరి అవుతుంది. అంటే.. ఐటీ రంగం ఇకపై 'మునుపటిలా' ఉండదు. ఇప్పటివరకు ఏఐని ఒక 'సహాయక టూల్'గా చూశారు. కానీ ఇప్పుడు అది ఐటీ కంపెనీలకు ఒక 'పోటీదారు'గా మారుతుంది. కంపెనీలు సాఫ్ట్‌వేర్ పనుల కోసం మనుషుల కంటే ఏఐ ఏజెంట్లపైనే ఎక్కువ ఆధారపడే అవకాశం ఉంది. రొటీన్ కోడింగ్, టెస్టింగ్, డేటా ఎంట్రీ వంటి పనులు పూర్తిగా ఏఐ చేతుల్లోకి వెళ్తాయి. ఐటీ ఉద్యోగులు కేవలం కోడింగ్ నేర్చుకుంటే సరిపోదు, ఏఐని మేనేజ్ చేసే 'ఏఐ కోఆర్డినేటర్'లుగా మారాల్సి ఉంటుంది. కేవలం సర్వీస్ ఇవ్వడం కాకుండా, హై-లెవల్ స్ట్రాటజీ, ఏఐ ఇంప్లిమెంటేషన్ వైపు మొగ్గు చూపకపోతే భారత కంపెనీలకు గడ్డు కాలం తప్పదు.

| ఆంత్రోపిక్ విలువ | |
|---|---|
| | ప్రధాన పెట్టుబడిదారులు: అమెజాన్, గూగుల్ |
| | మొత్తం నిధులు: 11 బిలియన్ డాలర్ల పైచిలుకు |
| | ప్రస్తుత విలువ: 183 - 350 బిలియన్ డాలర్లు |



# పిలగాండ్లు.. ప్రపంచ వీరులు!

వచ్చిన బంతి వచ్చినట్లే స్టాండ్స్‌లో ప్రత్యక్షం. బాల్ వేయడమే లేటు.. బంతి బౌండరీని తాడకమే. ఒక సిక్స్.. ఒక ఫోర్.. మళ్లీ సిక్స్.. మళ్లీ ఫోర్.. ఇలా ఒకటి కాదు, రెండు కాదు.. 15 సిక్సులు, 15 ఫోర్లు.. ఇది వైభవ్ సూర్యవంశీ వైభవోపేత ఇన్నింగ్స్. ఎహే! అక్షరాలు కూడా సరిపోవు మన బుడ్డోడి ప్రతాపం ముందు. బ్యాటుతో చేసిన తాండవం.. ఉగ్రరూపాన్నే తలపించింది. దెబ్బకు ఇంగ్లండ్ కుర్రాళ్లు బిత్తరపోయి తేలిపోయారు. వీడేంట్రా బాబూ అలా బాదుతున్నాడని తలలు పట్టుకున్నారు. ఇంకెప్పుడు అవుట్ అవుతాడోనని కండ్లు పెద్దవి చేసుకొని చూశారు. మొత్తంగా, అండర్ 19 వరల్డ్ కప్ ఫైనల్ అసలైన మజాను అందించాడు. వైభవ్ ఇన్నింగ్స్‌తో, తోటి బ్యాటర్ల సహకారంతో భారత్ స్కోరు 400 దాటింది. 50 ఓవర్లలో 411 పరుగులు చేసిన టీమిండియా.. ఇంగ్లండ్ బ్యాటర్లను 311 పరుగులకే పరిమితం చేసి, 100 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది.

# ఓటీపీ స్కాం..
## 25 వేల పరిహారం!

మొదటి పేజీ తరువాయి

తీసుకొస్తున్నాం. విలువ పరంగా ఇవి చిన్నవైనా సంఖ్య పరంగా చూస్తే సుమారు 65 శాతం ఫ్రాడ్‌లు రూ.50,000 లోపలే ఉంటాయి. మోసం జరిగితే రూ.25,000 వరకు కస్టమర్ బాధ్యత ఉండదు. ఎలాంటి ప్రశ్నలు ఉండవు. దుర్వినియోగం జరగకుండా సిస్టమ్‌లో చెక్స్ ఉంటాయి. కస్టమర్ నుంచి 15 శాతం బాధ్యత ఉంటుంది. బ్యాంకుల నుంచి కూడా 15 శాతం బాధ్యత ఉంటుంది. మిగిలిన మొత్తం రిజర్వ్ బ్యాంక్ భరిస్తుంది. మొత్తం చిన్నదే అయినా చిన్న కస్టమర్లకు ఇది చాలా ముఖ్యం. వెంటనే ఊరట కలిగించే ప్రయత్నం ఇది' అని ఆర్‌బీఐ చెప్పింది. ప్రతిపాదిత మెకానిజం ప్రకారం రూ.25,000 వరకు నష్టానికి కస్టమర్ బాధ్యత ఉండదు. ఎలాంటి ప్రశ్నలు అడగరు. అయితే దుర్వినియోగం జరగకుండా కొన్ని రక్షణ చర్యలు ఉంటాయి. ఈ ఫ్రేమ్‌వర్క్‌లో బాధ్యతను పంచుకుంటారు. కస్టమర్లు 15 శాతం భరిస్తారు. బ్యాంకులు 15 శాతం భరిస్తాయి. మిగిలిన మొత్తాన్ని ఆర్‌బీఐ కంపెన్సేషన్‌గా ఇస్తుంది. చిన్న డిపాజిటర్లకు ఇది వెంటనే ఉపశమనం కలిగించే విధానం. ఫ్రాడ్ కంపెన్సేషన్ ఒక్క కస్టమర్‌కు ఒక్కసారే లభిస్తుందని భారత రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్పష్టం చేసింది. ఈ ఫ్రేమ్‌వర్క్ ఉద్దేశ్యం తక్షణ ఊరట ఇవ్వడం మాత్రమే అని ఆర్‌బీఐ చెప్పింది. చిన్న మొత్తాల ఫ్రాడ్ బాధితులకు సాంత్వన ఇవ్వాలన్నదే లక్ష్యం. అయితే కస్టమర్లు జాగ్రత్తగా ఉండాలి. బాధ్యతతో వ్యవహరించాలి. గత తప్పుల నుంచి పాఠాలు నేర్చుకోవాలి. మళ్లీ మళ్లీ నిర్లక్ష్యం జరిగితే ఈ మెకానిజం కింద కంపెన్సేషన్ ఇవ్వబోమని సెంట్రల్ బ్యాంక్ స్పష్టంగా తెలిపింది.



# వడ్డీరేట్లు యథాతథం

మొదటి పేజీ తరువాయి

ఆయన స్పష్టం చేశారు. దేశ ఆర్థిక పరిస్థితులు, భవిష్యత్ అంచనాలను జాగ్రత్తగా పరిశీలించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్లు గవర్నర్ తెలిపారు. గత డిసెంబర్ సమావేశం తర్వాత ప్రపంచవ్యాప్తంగా ప్రతికూలతలు పెరిగినప్పటికీ, ప్రభుత్వం కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాలు ఆర్థిక వ్యవస్థకు సానుకూలంగా ఉన్నాయని ఆయన అన్నారు. ద్రవ్యోల్బణాన్ని నియంత్రిస్తూనే, వృద్ధికి ఆటంకం కలగకుండా సమతౌల్యం పాటించడమే 'న్యూట్రల్' వైఖరి ఉద్దేశమని వివరించారు. ద్రవ్యోల్బణం అదుపులోనే ఉందని, ఆర్బీఐ నిర్దేశించిన సహన పరిమితి కంటే తక్కువగా ఉందని మల్హోత్రా పేర్కొన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి రెండు త్రైమాసికాలకు సీపీఐ ద్రవ్యోల్బణ అంచనాలను వరుసగా 4 శాతం, 4.2 శాతానికి సవరించినట్లు తెలిపారు. భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి అంచనాలు ఆశాజనకంగా ఉన్నాయని, దేశీయ అంశాలే దీనికి కారణమని ఆయన అభిప్రాయపడ్డారు. గత డిసెంబర్‌లో జరిగిన సమీక్షలో వృద్ధిని ప్రోత్సహించేందుకు ఆర్బీఐ రెపో రేటును 5.5 శాతం నుంచి 5.25 శాతానికి (25 బేసిస్ పాయింట్లు) తగ్గించిన విషయం తెలిసిందే. అంతకుముందు ఆగస్టు, అక్టోబర్‌లలో రేట్లను స్థిరంగా ఉంచింది. ప్రస్తుతం రేట్లలో మార్పు లేనందున గృహ, వాహన రుణాలతో సహా ఇతర రుణాలపై వడ్డీ రేట్లు ఇప్పట్లో పెరిగే అవకాశం లేదు.

# కేసుల కొట్టివేత కుదరదు!

**సీఎం రేవంత్‌కు హైకోర్టులో నిరాశ**

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హైకోర్టులో నిరాశ ఎదురయింది. 2023 ఎన్నికల సమయంలో తనపై నమోదైన క్రిమినల్ కేసులను కొట్టేయాలని కోరతూ ఆయన దాఖలు చేసిన క్వాష్ పిటిషన్ ను హైకోర్టు కొట్టేసింది. రాజకీయ కారణాలతోనే కేసులు పెట్టారని రేవంత్ తరపు న్యాయవాదులు వాదించినప్పటికీ ఆ వాదనలతో న్యాయస్థానం ఏకీభవించలేదు. కేసు విచారణ దశలో ఉన్నందున ఇప్పుడు కొట్టివేయలేమని స్పష్టం చేస్తూ, రేవంత్ పిటిషన్ ను తిరస్కరించింది. తదుపరి విచారణను ఈ నెల 21వ తేదీకి వాయిదా వేసింది. కేసు వివరాల్లోకి వెళితే... రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు 2023లో జరిగిన ఎన్నికల సమయంలో భూపాలపల్లిలో జరిగిన బహిరంగ సభలో రేవంత్ ప్రసంగిస్తూ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీంతో, తన వక్తిత్వాన్ని దెబ్బతీసేలా అభ్యంతరకరంగా మాట్లాడారంటూ పోలీసులకు గండ్ర ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా రేవంత్ రెడ్డిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ కేసులను కొట్టివేయాలని కోరుతూ హైకోర్టులో రేవంత్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ ను విచారించిన హైకోర్టు పిటిషన్ ను కొట్టివేసింది.

# బిట్ కాయిన్.. కొల్లాప్స్!

మొదటి పేజీ తరువాయి

డాలర్ల విలువైన బిట్ కాయిన్లను ఇన్వెస్టర్లు వదులుకున్నారు. గత ఏడాది అక్టోబర్‌లో బిట్ కాయిన్ విలువ అత్యధికంగా 1,26,000 డాలర్లకు చేరుకుంది. ప్రస్తుతం బిట్ కాయిన్ మార్కెట్ మొత్తం విలువ 1.28 ట్రిలియన్ డాలర్లుగా ఉంది. గడిచిన 24 గంటల్లో విలువ తగ్గి 143.98 బిలియన్ డాలర్లకు చేరింది. క్రిప్టోకరెన్సీ మార్కెట్‌లో బిట్ కాయిన్ వాటా 58.2 శాతం ఉంది. తర్వాత రెండో స్థానంలో ఎథేరియం 10.4 శాతం, మిగతా వాటి వాట 31.5 శాతంగా ఉంది. టెథర్ ధర స్థిరంగా 0.9988 డాలర్ల వద్ద ఉండగా, బైనాన్స్ కాయిన్ ధర 619 డాలర్ల వద్ద, ఎక్స్ఆర్‌పి ధర 1.27 డాలర్ల వద్ద కొనసాగుతుండగా, సోలానా 68 డాలర్ల దిగువకు, డాగ్‌కాయిన్ 0.09 డాలర్ల దిగువకు పడిపోయాయి. ప్రస్తుతం క్రిప్టో మార్కెట్ భారీ నష్టాల్లో ట్రేడవుతోంది. ట్రేడర్లు జాగ్రత్తగా ఉండాలని, సపోర్ట్ లెవల్స్ దగ్గర బాగా గమనించాలని నిపుణులు సూచిస్తున్నారు.

# పేలిన శరీరాలు!

మొదటి పేజీ తరువాయి

ఆపరేషన్లను'ను వేగవంతం చేసింది. తాజాగా జరిగిన బ్లాస్టింగ్ కూడా ఉగ్రమూకల పనే అయి ఉండొచ్చని పాక్ భద్రతా బలగాలు అనుమానిస్తున్నాయి. ఇదిలా ఉంటే 3 నెలల క్రితం (11 నవంబర్ 2025న) ఇస్లామాబాద్‌లోని జీ-11 ప్రాంతం లోని జిల్లా సెషన్స్ కోర్టు భవనం వెలుపల ఆత్మాహుతి బాంబు దాడి జరిగింది. ఆ పేలుడులో 12 మంది మృతి చెందగా 30 మందికి పైగా తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే.

# ఇదే లాస్ట్ చాన్స్!

మొదటి పేజీ తరువాయి

వాదనలు వినిపించారు. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్ ఇప్పటికే విచారణ జరుపుతున్నారని కోర్టుకు తెలిపారు. ఒక ఎమ్మెల్యే పిటిషన్‌పై విచారణ పూర్తయిందని, మరో ఇద్దరిపై ప్రక్రియ కొనసాగుతోందని వివరించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నిర్ణయం తీసుకోవడానికి మరింత సమయం కావాలని ఆయన కోరారు. ప్రభుత్వ న్యాయవాది అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, తుది అవకాశంగా మూడు వారాల గడువు మంజూరు చేసింది. ఈ గడువు తర్వాత తదుపరి విచారణ జరుపుతామని పేర్కొంటూ, కేసును మూడు వారాలకు వాయిదా వేసింది.



# ఇప్పటిదాకా మేడారం హుండీ ఆదాయం 6.04 కోట్లు

**రెండ్రోజుల లెక్కింపు పూర్తి.. నేడూ కొనసాగింపు**

హనుమకొండ, ఫిబ్రవరి 6 (ఈవార్తలు): మేడారం సమ్మక్క- సారక్క జాతరలో ఏర్పాటు చేసిన హుండీల్లో ఇప్పటి వరకు రూ.6,04,53,636 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో తెలిపారు. గురువారం నుంచి హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో కొనసాగుతున్న లెక్కింపు శుక్రవారం కూడా కొనసాగింది. గురువారం నాటికి రూ.2.5 కోట్ల ఆదాయాన్ని లెక్కించగా, శుక్రవారం ఒక్క రోజే 3.5 కోట్ల ఆదాయాన్ని లెక్కించారు. మొత్తంగా రెండు రోజుల లెక్కింపులో రూ.6 కోట్ల ఆదాయం వచ్చింది. మొత్తం హుండీలు 828 ఉండగా, అందులో 285 హుండీలనే ఇప్పటి వరకు లెక్కించారు. శనివారం కూడా హుండీ ఆదాయ లెక్కింపు కొనసాగనుంది.



# వేములవాడ హుండీ ఆదాయం రూ.2.7 కోట్లు

**రెండు రోజుల పాటు లెక్కింపు పూర్తి**

వేములవాడ, ఫిబ్రవరి 6 (ఈవార్తలు): దక్షిణ కాశీ వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానం పరిధిలోని శ్రీ భీమేశ్వరాయంలో ఏర్పాటు చేసిన హుండీల్లో భారీగా ఆదాయం సమకూరింది. గత 13 రోజుల్లో భక్తులు అందించిన మొత్తం రూ.2,74,62,765 అని ఆలయ కార్యనిర్వహణాధికారి రమాదేవి తెలిపారు. ఇక, 118.8 గ్రాముల బంగారం, 11 కిలోల వెండి సమకూరినట్లు వెల్లడించారు. హుండీ లెక్కింపులో శ్రీ రాజరాజేశ్వర సేవా సమితి సభ్యులు, ఏసీ కార్యాలయ పరిశీలకుడు రాజమౌళి, ఏఈఓలు, పర్యవేక్షకులు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు. ఎస్పీఎఫ్, హోమ్ గార్డ్ సిబ్బంది భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## 9 నుంచి జర్నలిస్టుల అక్రెడిటేషన్లకు దరఖాస్తులు

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వర్కింగ్ జర్నలిస్టుల కోసం 'తెలంగాణ మీడియా అక్రెడిటేషన్ రూల్స్-2025'ను అధికారికంగా విడుదల చేసింది. సమాచార పౌర సంబంధాల శాఖ జీవో నెం.252ను జారీ చేస్తూ, కొత్త నిబంధనల ప్రకారం అక్రెడిటేషన్ కార్డుల కోసం దరఖాస్తు ప్రక్రియను ప్రారంభించింది. అర్హులైన ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా ప్రతినిధులు ఫిబ్రవరి 9 నుంచి సమాచార పౌర సంబంధాల శాఖ అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. కాగా, అక్రెడిటేషన్ కార్డుల కాలపరిమితి రెండు సంవత్సరాలు ఉండనుంది. అక్రెడిటేషన్లకు అర్హత కోసం దినపత్రికలు కనీసం 2 వేల ప్రతుల సర్క్యులేషన్ కలిగి ఉండాలనే నిబంధన పెట్టారు. అదేవిధంగా వార, పక్ష పత్రికలు కనీసం 18 నెలల పాటు నిరంతరంగా ప్రచురితమై ఉండాలనే కండీషన్ కూడా ఉంది. డెస్క్ జర్నలిస్టుల విషయంలో మీడియా సంస్థలు కనీసం 33 శాతం మహిళలకు కేటాయించడం తప్పనిసరి చేశారు. అక్రెడిటేషన్ కోటాలో కూడా మహిళా జర్నలిస్టులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. కనీసం ఏడాది కాలంగా నడుస్తున్న వెబ్‌సైట్లు, గత ఆరు నెలల్లో సగటున నెలకు 5 లక్షల యూనిక్ విజిటర్లను కలిగి ఉన్న పక్షంలో అక్రెడిటేషన్‌కు అర్హులు. కార్డు జారీ తర్వాత అక్రెడిటేషన్ కార్డు పోతే డూప్లికేట్ లేదా రీప్లేస్‌మెంట్ కార్డుల కోసం రూ.250 రూపాయల రుసుము చెల్లించాల్సి ఉంటుంది.

## 'జంపింగ్'లకు రేవంత్ మద్దతు!

**నన్ను పక్కన పెట్టాలని చూస్తున్నరు**

**కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి కంటతడి**

జగిత్యాల, ఫిబ్రవరి 6 (ఈవార్తలు): జగిత్యాల మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి భావోద్వేగానికి లోనయ్యారు. ఎన్నికల్లో తన వర్గానికి సీట్లు కేటాయించకుండా పక్కకు పెట్టడంపై ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. రాజకీయంగా తన మెడ నరకడానికి కాంగ్రెస్ పార్టీలో ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. తన భుజాలుగా ఉన్న వ్యక్తులను తనకు దూరం చేశారని చెప్పారు. పార్టీ మారితే రాళ్లతో కొట్టమని చెప్పిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. ప్రచారం సందర్భంగా పార్టీకి చెందిన మహిళలు, కార్యకర్తలతో ఆయన తన బాధను చెప్పి కన్నీళ్లు పెట్టుకున్నారు. దాంతో వారు జీవన్‌రెడ్డిని ఓదార్చారు. మున్సిపాలిటీలో తాము మీ వర్గాన్ని గెలిపించి తీరుతామని చెప్పారు. కాగా చట్టసభలకు ఏ పార్టీ తరఫున గెలిస్తే ఆ పార్టీలోనే ఉండాలని గతంలో రాహుల్‌గాంధీ చెప్పిన విషయాన్ని జీవన్‌రెడ్డి గుర్తుచేశారు. రేవంత్ రెడ్డి ఆయన పార్టీ మారితే రాళ్లతో కొట్టాలని గతంలో చెప్పారని, కానీ ఆయనే పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. వేరే పార్టీల్లో గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన వాళ్లను ఓటుతో కొట్టాలని తాను అంటున్నానని చెప్పారు. తన వర్గం వారికి కాంగ్రెస్ సీట్లు నిరాకరించడంతో కొన్ని వార్డుల్లో స్వతంత్ర్యులుగా బరిలో దిగిన తన వర్గం వారి తరఫున జీవన్‌రెడ్డి ప్రచారం చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తన వర్గాన్ని పక్కనపెట్టి.. తనతోపాటు బీఆర్ఎస్ పార్టీ నుంచి వచ్చిన వారిని ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. సంజయ్ కుమార్ తాను బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నానని చెబుతున్నారని, కానీ కాంగ్రెస్ జెండా పట్టుకుని ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్‌లోనే ఉన్నా అంటూ సంజయ్ కాంగ్రెస్ జెండాను ఎత్తుకుపోయాడని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలో దొంగలు పడ్డారని వ్యాఖ్యానించారు.

# రేవంత్ పాపాత్ముడు

**దేవుడిపై ఒట్టేసి రైతులను మోసం చేశాడు**

**మాజీమంత్రి హరీశ్ రావు మండిపాటు**



జిన్నారం, ఫిబ్రవరి 6 (ఈవార్తలు): మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీష్‌రావు పటాన్‌చెరువు నియోజకవర్గంలోని జిన్నారం మున్సిపాలిటీలో శుక్రవారం పర్యటించారు. జిన్నారం గ్రామం వాకిటి వద్ద స్థానికులతో ముచ్చటించిన ఆయన.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తున్న తీరును ఎండగట్టారు. తాము అధికారంలో ఉన్నప్పుడు జిన్నారం గ్రామం గ్రామపంచాయతీగానే ఉండాలని కోరుకున్నామని, మున్సిపాలిటీ అయితే ప్రజల మీద పన్నుల భారం పడుతుందని ఆపామని చెప్పారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే జిన్నారంను మున్సిపాలిటీ చేసి మీ మీద పన్నుల భారం మోపిందని, ఇప్పుడు ఎవరికి ఓటేద్దాం..? అని ఓటర్లను ప్రశ్నించారు. మనల్ని మంచిగా చూసుకున్న వాళ్ళకు, మన భారాన్ని తగ్గించే వాళ్ళకే ఓటేద్దామని అన్నారు. కేసీఆర్ రూ.200 ఉన్న పెన్షన్‌ను రూ.2000 చేస్తానని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన మొదటి నెలలోనే ఆ హామీని నెరవేర్చారని చెప్పారు. రేవంత్ రెడ్డి రూ.4000 ఇస్తానని చెప్పి రెండేళ్లు గడిచినా ఇవ్వడం లేదని విమర్శించారు. ఏపీలో చంద్రబాబు రూ.4000 ఇస్తానని చెప్పి ఇస్తున్నాడు కదా? మరి ఇక్కడ రేవంత్ రెడ్డికి ఎందుకు చేతులు రావడం లేదు..? అని ప్రశ్నించారు. మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ.2500 ఇస్తానని చెప్పి రేవంత్ రెడ్డి మోసం చేశాడని హరీష్‌రావు విమర్శించారు. ఈ 24 నెలల్లో ఒక్కో మహిళకు ప్రభుత్వం రూ.60,000 చొప్పున బాకీ పడిందని అన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు బతుకమ్మకు ప్రతి మహిళకు చీర ఇచ్చేదని, రేవంత్ రెడ్డి వచ్చాక చీర లేదు, గాజులు లేవని చెప్పారు. ఏదో గ్రూపులో ఉన్న కొద్దిమందికి ఇచ్చి చేతులు దులుపుకున్నాడని అన్నారు. ఫ్రీ బస్సు అని చెప్పి మగవాళ్లకు టికెట్ రేట్ డబుల్ చేశాడని తెలిపారు. ఆడోళ్ళకు సీటు దొరక్క తిప్పలు పడుతున్నారని చెప్పారు. రేవంత్ రెడ్డి వచ్చాక 5 పంటలు వస్తే.. రెండింటికి ఇచ్చి మూడింటికి రైతుబంధు ఎగ్గొట్టాడని విమర్శించారు. నాటేసిన వాళ్లకే రైతుబంధు ఇస్తా, శాటిలైట్‌లో చూసి ఇస్తా అని కొత్త నిబంధనలు పెట్టి రైతులను గోస పెడుతున్నాడని రేవంత్‌రెడ్డిపై హరీష్‌రావు మండిపడ్డారు. దేవుడి మీద ఒట్టు వేసి రుణమాఫీ చేస్తానని చెప్పి మాట తప్పిన పాపాత్ముడు రేవంత్ రెడ్డి అని విమర్శించారు. ఏ ఊర్లో చూసినా సగం మందికి కూడా రుణమాఫీ కాలేదన్నారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో మీరు కారు గుర్తుకు ఓటు గుద్దితే.. రేవంత్ రెడ్డికి గూబ గుయ్యిమనాలె అని పిలుపునిచ్చారు. అప్పుడే భయపడి హామీలైనా అమలు చేస్తాడని అన్నారు. ఓటుకు 5 వేలు ఇస్తామంటారని, అవి తీసుకొని మోసపోవద్దని హెచ్చరించారు. మహిళలకు రావాల్సిన రూ.60,000, అవ్వ తాతలకు రూ.4000 పెన్షన్ రావాలంటే బీఆర్ఎస్ గెలవాలని అన్నారు. అవ్వతాతలు పెన్షన్ అడిగితే లాగుల తొండలు ఇడిసిపెడతా అంటాడని, మహిళలు హామీల గురించి అడిగితే మెడలో పేగులు వేసుకుంటా అంటాడని, తులం బంగారం ఏదని అడిగితే గుడ్లు పీకి గోటీలు ఆడుతా అంటాడని హరీష్‌రావు సీఎంను విమర్శించారు. ప్రశ్నిస్తే కళ్లు నెత్తికెక్కి మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. ఈ ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పి సీఎం అహంకారాన్ని దించాలని పిలుపునిచ్చారు. రెండేళ్లు ఓపిక పట్టాలని, వచ్చేది మళ్ళీ కేసీఆర్ ప్రభుత్వమేనని అన్నారు. జిన్నారం సమస్యలు పరిష్కరించుకుందామని చెప్పారు. రేవంత్ రెడ్డి ముస్లింలకు ఒక్క రూపాయి పని కూడా చేయలేదని, కాబట్టి అందరూ ఏకమై కారు గుర్తు అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

# కల్వకుంట్ల కిషన్ రావు!

**కేసీఆర్, కేటీఆర్‌ను కాపాడుతున్నది ఆయనే**

**అర్వింద్‌కు పరపతి ఉంటే**

**నిజామాబాద్ స్మార్ట్ సిటీ రాలేదేం?**

**నిజామాబాద్ సభలో సీఎం రేవంత్ రెడ్డి**



నిజామాబాద్, ఫిబ్రవరి 6 (ఈవార్తలు): కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిలో, ఫార్ములా ఈ-కార్ రేసింగ్‌లో కేసీఆర్, కేటీఆర్‌లను ఎప్పుడు అరెస్టు చేస్తారని తాను బీజేపీని ప్రశ్నిస్తున్నానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. వారిద్దరినీ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కాపాడుతున్నారని ఆరోపించారు. కిషన్ రెడ్డి ఇక్కడ కల్వకుంట్ల కిషన్ రావుగా మారారని ఎద్దేవా చేశారు. నిజామాబాద్ జిల్లా బర్ధీపూర్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఎంపీగా ధర్మపురి అరవింద్‌ను రెండుసార్లు గెలిపించినా నిజామాబాద్ ప్రాంతానికి బీజేపీ చేసిందేమీ లేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నరేంద్ర మోదీ మూడుసార్లు ప్రధాని అయ్యారని కానీ నిజామాబాద్ స్మార్ట్ సిటీ కాలేదని విమర్శించారు. ఇక్కడి వ్యవసాయం తెలంగాణకే కాదు దేశానికే ఆదర్శమని అన్నారు. నిజామాబాద్‌లో ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు అదనపు నిధులు ఇచ్చేందుకు ప్రయత్నిస్తామని అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సూచనలతో ఈ జిల్లాలో అభివృద్ధి పనులు చేస్తున్నామని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ వాళ్లు కార్పొరేటర్లుగా ఉంటే అభివృద్ధి వేగంగా జరుగుతుందని అన్నారు. తనకు కులం, మతం లేదని, అందరివాడినని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. నిజామాబాద్ జిల్లా గొప్ప నాయకులను అందించిందని, మున్సిపల్ ఎన్నికల్లో విలక్షణమైన తీర్పు ఇవ్వాలని కోరారు. బీఆర్ఎస్ హయాంలో నిజామాబాద్ మురికికూపంగా మారిందని విమర్శించారు. మోదీ దగ్గర ధర్మపురి అరవింద్‌కు పరపతి ఉంటే నిజామాబాద్‌ను స్మార్ట్ సిటీగా ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు.

## జనగామ జిల్లాలో పులి సంచారం?



జనగామ, ఫిబ్రవరి 6 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్రంలోని జనగామ జిల్లాలో పులి సంచరిస్తుందనే వార్తలు ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. మహారాష్ట్ర అడవుల నుంచి వచ్చిన పులి సిద్దిపేటలోని జగదేవ్‌పూర్, ఆలేరు మండలం మీదుగా జనగామ జిల్లాల్లోకి ప్రవేశించిందనే వార్తలతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని రఘునాథ్‌పల్లి మండలం, మండెలగూడెం గ్రామ సమీపంలో పులి సంచరిస్తున్నట్లు దాని అడుగుల ద్వారా గుర్తించినట్లు జనగామ మరియు హన్మకొండ అటవీ శాఖ అధికారి లావణ్య పత్రికా ప్రకటన విడుదల చేశారు. మండెలగూడం సమీపంలోని తండాలో పులి ఒక లేగదూడను చంపి తిన్నట్లు అధికారులు గుర్తించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారి సూచించారు. పులి సంచారం నేపథ్యంలో జనగామ జిల్లాల్లోని పలు గ్రామాల్లో చాటింపు వేశారు. పులి సమీప ప్రాంతాల్లో తిరుగుతున్నందున అత్యవసరమైతే తప్ప ఎవరూ బయటకు రావొద్దని, సాధ్యమైనంత వరకు గుంపులు గుంపులుగా రావాలని అధికారులు పలు గ్రామాల్లో చాటింపు వేశారు. ముఖ్యంగా, సాయంత్రం ఐదు తర్వాత అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని సూచించారు. పశువులను ఇంటి వద్ద సంరక్షించుకోవాలని పేర్కొన్నారు. మండెలగూడెం, మచ్చుపహాడ్, కొత్తగూడెం, ఖిలాషాపురం తదితర గ్రామాల్లో చాటింపు వేశారు.

## పేదరిక నిర్మూలనకు 'కుటుంబశ్రీ'

**కేరళ తరహా పథకం తెస్తున్నాం: సీతక్క**



హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఈవార్తలు): పేదరికాన్ని నిర్మూలించేందుకు రాష్ట్రంలో కొత్త పథకాన్ని ప్రారంభించబోతున్నామని మంత్రి సీతక్క వెల్లడించారు. కేరళలో అమలు చేస్తున్న 'కుటుంబశ్రీ' మోడల్ ను అనుసరించి ఈ పథకానికి రూపకల్పన చేస్తున్నామని చెప్పారు. కేరళలో ఒక సర్వే నిర్వహించారని... దాని ద్వారా 65 వేల మంది పేదలను గుర్తించి, వారిని పేదరికం నుంచి బయటకు తీసుకొచ్చారని సీతక్క తెలిపారు. అదే తరహాలో తెలంగాణలో మహిళా స్వయం సహాయక బృందాల ద్వారా సర్వే చేయించి, పేదరికంలో ఉన్న వారిని గుర్తిస్తామని చెప్పారు. సర్వే పూర్తయిన తర్వాత ప్రతి పేద కుటుంబానికి తగిన సాయం అందిస్తామని సీతక్క తెలిపారు. ప్రభుత్వ ఖజానాపై ఆర్థిక భారం పడినా పథకాన్ని అమలు చేస్తామని చెప్పారు. ఈ కొత్త పథకం ద్వారా రాష్ట్రంలో పేదరికం లేకుండా చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.

## కేసీఆర్‌ను జాతిపిత అంటే ఒప్పుకోను: కోదండరాం

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఈవార్తలు): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను తెలంగాణ జాతిపిత అంటే తాను ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకోనని ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. జాతిపిత అనే బిరుదు ఎవరికి వారు పెట్టుకునేది కాదని... అది ప్రజలు ఇవ్వాలని చెప్పారు. తెలంగాణ ఉద్యమకారులను కేసీఆర్ ఏనాడూ పట్టించుకోలేదని విమర్శించారు. తెలంగాణ అస్థిత్వాన్ని వ్యక్తిగత లబ్ధికి వాడుకోవడం దారుణమని అన్నారు.

**బీజేపీ గెలిస్తే మోడ్రన్ మున్సిపాలిటీలు**

**టీజీ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు హామీ**

**బీజేపీ 'మున్సిపల్' మేనిఫెస్టో విడుదల**

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఈవార్తలు): తెలంగాణలో బీజేపీ మున్సిపల్ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసింది. మున్సిపల్ ఎన్నికల రాష్ట్ర సహ ఇన్‌ఛార్జ్‌లు అశోక్ పర్ణామి, రేఖా శర్మతో కలిసి 'వికసిత్ తెలంగాణ.. బీజేపీ సంకల్ప పత్రం' పేరుతో మున్సిపల్ ఎన్నికల మేనిఫెస్టోను రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తెలంగాణలో జరిగే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ గెలిస్తే పెండింగ్ పనుల్లో వెసులుబాటు కల్పిస్తామని, మోడ్రన్ మున్సిపాలిటీలుగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ఫైనాన్స్ కమిషన్ ఇచ్చే నిధులను పారదర్శకంగా ఖర్చు చేస్తామని తెలిపారు. అవినీతిరహిత మున్సిపాలిటీలే తమ లక్ష్యమని తెలిపారు. కబ్జాలపై ఉక్కుపాదం మోపుతామని అన్నారు. యువతకు వాకింగ్ ట్రాక్స్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలు బీజేపీని చూసి భయపడుతున్నాయని అన్నారు. కేంద్రం తెలంగాణకు ఏమిచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారని, ఏ జిల్లాకు ఎంతిచ్చామో కూడా చెబుతామని అన్నారు. మరి రేవంత్ రెడ్డి ఏమిచ్చారో చెబుతారా అని నిలదీశారు. బీజేపీ కార్యకర్తలపై పోలీసులు దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ పోలీసులను తమ కార్యకర్తల్లా ఉపయోగించుకుంటోందని అన్నారు.

## 14 ఎకరాల భూమి సేఫ్

**రెండు చోట్ల హైడ్రా చర్యలు**

**బోరబండ, సుమారుకుంటలో ఆక్రమణల తొలగింపు**

బోరబండ/హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఈవార్తలు): హైదరాబాద్ నగరంలో ఆక్రమణలపై హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) ఉక్కుపాదం మోపింది. శుక్రవారం నగరంలోని పలు కీలక ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, అక్రమ నిర్మాణాలను తొలగించింది. ఈ ఆపరేషన్‌లో భాగంగా చెరువు శిఖం, ప్రభుత్వ, ఆలయ భూములను కబ్జాదారుల చెర నుంచి విడిపించింది. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, దుండిగల్-గండిమైసమ్మ మండలం, దూలపల్లి గ్రామంలోని సుమారుకుంట చెరువు వద్ద హైడ్రా అధికారులు భారీ ఆపరేషన్ చేపట్టారు. సుమారు 42 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువు ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) పరిధిలో అక్రమంగా నిర్మాణాలు వెలిశాయి. దాదాపు 11 ఎకరాల విస్తీర్ణంలో మట్టిని నింపి, స్క్రాప్ దుకాణాలు, హోటళ్లు, కంటైనర్ల తయారీ షాపులు, వెల్డింగ్ దుకాణాల వంటి తాత్కాలిక షెడ్లు నిర్మించారు. వర్షాకాలంలో వరద ముంపునకు కారణమవుతాయనే ఉద్దేశంతో ఈ నిర్మాణాలను తొలగించినట్లు అధికారులు తెలిపారు. శిఖం పట్టా భూముల్లో నీరు లేనప్పుడు వ్యవసాయం చేసుకోవచ్చు కానీ, శాశ్వత నిర్మాణాలు చేపట్టడం నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేశారు. ఫెన్సింగ్ ఏర్పాటు మరోవైపు, ఖైరతాబాద్ మండలం యూసుఫ్‌గూడ పరిధిలోని బోరబండలో 3.20 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని హైడ్రా స్వాధీనం చేసుకుంది. సర్వే నంబర్ 128/1లో ఉన్న ఈ భూమిని గతంలో అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎల్‌సీ) చట్టం కింద ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. అయితే, యూఎల్‌సీ క్లియరెన్స్ వచ్చినట్లు షరీఫ్ ఖాన్ అనే వ్యక్తి నకిలీ పత్రాలు సృష్టించి భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నించాడు. దీనిపై హైడ్రా అధికారులు బోరబండ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఆక్రమణలో ఉన్న ఇసుక, ఇటుక వ్యాపారాల షెడ్లను తొలగించి, స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. అలాగే, కీసర మండలం నాగారం, రామకృష్ణ నగర్‌లోని శివాలయానికి చెందిన 1,365 గజాల స్థలాన్ని కూడా హైడ్రా కాపాడింది. 2017లో 400 గజాల్లో ఆలయాన్ని నిర్మించగా, మిగిలిన స్థలం ఖాళీగా ఉంది. ఈ భూమిని కొందరు స్థానికులు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని కాలనీవాసులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. క్షేత్రస్థాయిలో విచారణ జరిపిన అధికారులు, ఆ భూమి ఆలయానికి చెందినదేనని నిర్ధారించుకున్నారు.

## కోటి పరిహారమిప్పిస్తే రాజీనామా చేస్తా

**సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు సవాల్**

సంగారెడ్డి, ఫిబ్రవరి 6 (ఈవార్తలు): సంగారెడ్డి జిల్లాలోని సిగాచీ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఒక్క రూపాయి పరిహారం ఇవ్వలేదని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు మండిపడ్డారు. మృతుల కుటుంబాలకు ఈ ప్రభుత్వం రూ.1 కోటి పరిహారం ఇచ్చినట్లు నిరూపిస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ చేశారు. బాధిత కుటుంబాలకు సిగాచీ పరిశ్రమ మాత్రమే రూ.25 లక్షల చొప్పున ఇచ్చిందని అన్నారు. సిగాచీ కంపెనీలో 54 మంది ప్రాణాలు కోల్పోతే ప్రభుత్వం పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.1 కోటి పరిహారం ఇస్తామని చెప్పి రూపాయి ఇవ్వలేదని విమర్శించారు.



# అవగాహనతోనే కుష్టు నిర్మూలన

## ముషీరాబాద్లో 'స్పర్శ్' కార్యక్రమం.. కుష్టు లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం వద్దు

ముషీరాబాద్, ఫిబ్రవరి 6 (ఈవార్తలు): ముషీరాబాద్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 'స్పర్శ్' కుష్టు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డా. ఎం. మనోజ్ రెడ్డి, వైద్యాధికారి ఆధ్వర్యంలో నిర్వహించగా, డీపీఎంఓ ప్రసాద్, ఏఎన్ఎం విజయ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. మనోజ్ రెడ్డి మాట్లాడుతూ.. కుష్టు వ్యాధి పూర్తిగా నయమయ్యే వ్యాధి అని, సరైన సమయంలో చికిత్స తీసుకుంటే ఎలాంటి సమస్యలు ఉండవని తెలిపారు. కుష్టు వ్యాధిపై ఉన్న అపోహలు, సామాజిక వివక్షను తొలగించడమే ఈ 'స్పర్శ్' కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. అనంతరం డీపీఎంఓ ప్రసాద్ మాట్లాడుతూ.. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమం కింద ప్రభుత్వం ఉచితంగా ఎండీటీ మందులను అందిస్తున్నదని, అనుమానాస్పద లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని సూచించారు. కుష్టు వ్యాధిపై భయపడాల్సిన అవసరం లేదని, అవగాహనతోనే నిర్మూలన సాధ్యమని అన్నారు. ఏఎన్ఎం విజయ మాట్లాడుతూ.. చర్మంపై మచ్చలు, భావన కోల్పోవడం, గడ్డలు వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వైద్య సలహా తీసుకోవాలని విద్యార్థులకు వివరించారు. అలాగే వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపకుండా మానవత్వంతో మెలగాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొని కుష్టుపై అవగాహన పెంచుకున్నారు.




# యూజీసీ రూల్స్ అమలు చేయాల్సిందే

## సుప్రీం కోర్టు తీర్పు అభ్యంతరకరం.. ఓయూ బీసీ విద్యార్థి నేత రమేశ్ యాదవ్

**రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులుతో కలిసి ప్రెస్ మీట్**

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఈవార్తలు): యూజీసీ కొత్తగా తీసుకొచ్చిన ఈక్విటీ రెగ్యులేషన్ రూల్స్‌ను వెంటనే అమలు చేయాలని ఓయూ బీసీ విద్యార్థి జేఏసీ నేత కడారి రమేశ్ యాదవ్ డిమాండ్ చేశారు. యూజీసీ రూల్స్‌పై స్టే విధిస్తూ సుప్రీం కోర్టు తీసుకున్న నిర్ణయాన్ని ఖండిస్తున్నామని అన్నారు. శుక్రవారం తెలంగాణ సచివాలయం మీడియా పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీసీ ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు, బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాలరాజు గౌడ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే 2026 నూతన ఈక్విటీ రెగ్యులేషన్ బిల్లును దేశవ్యాప్తంగా ఉన్న ఉన్నత విద్యాసంస్థలలో తక్షణమే అమలు అయ్యేలా చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే మండల్ ఉద్యమం స్ఫూర్తితో, కమండల్ వారసులకు వ్యతిరేకంగా మలిదశ మండల్ ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ ఇంటలెక్చువల్ ఫోరం సభ్యులు శ్రీకాంత్, లింగేశ్ యాదవ్, వెంకన్న, దుర్గయ్య గౌడ్, ఎలికంటి విజయ్ కుమార్, అంబాల నారాయణ గౌడ్, బైరి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# టీటీడీ ఈవోగా రవిచంద్ర బాధ్యతలు

తిరుమల, ఫిబ్రవరి 6 (ఈవార్తలు): తిరుమల తిరుపతి దేవస్థానం ఈవోగా సీనియర్ ఐఏఎస్ అధికారి ముద్దాడ రవిచంద్ర బాధ్యతలు స్వీకరించారు. ఇటీవలే టీటీడీ ఈవోగా ముద్దాడ రవిచంద్రను ప్రభుత్వం నియమించిన సంగతి తెలిసిందే. అయితే శుక్రవారం బాధ్యతలు స్వీకరించేందుకు ఐఏఎస్ అధికారి ముద్దాడ రవిచంద్ర గురువారం సాయంత్రం తిరుమల చేరుకున్నారు. తిరుమలలో ముద్దాడ రవిచంద్రను ఇన్‌చార్జి ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో శ్రీ వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీ మురళీ కృష్ణలు స్వాగతం పలికారు. అనంతరం రాత్రికి ఐఏఎస్ అధికారి ముద్దాడ రవిచంద్ర దంపతులు శ్రీ గాయత్రి నిలయంలో విశ్రాంతి తీసుకుని శుక్రవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ప్రత్యేక పూజల అనంతరం ఈవోగా బాధ్యతలు చేపట్టారు. శ్రీవారి సేవ చేసుకునే భాగ్యం కలగడం తన అదృష్టం అని టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర అన్నారు. భక్తులకు సేవ చేయడం ద్వారా ఆ దేవుడికి సేవ చేసే అవకాశం దక్కింది అని అన్నారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, ఏపీ ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. భక్తుల నమ్మకాన్ని, ప్రభుత్వం తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటానని తెలిపారు. గతంలో పనిచేసిన అధికారుల అనుభవం, ప్రస్తుతం ఉన్నవారి సహకారంతో ముందుకు వెళ్తానని అన్నారు. చైర్మన్, బోర్డు సభ్యులు, ఉద్యోగులందరి సమన్వయంతో భక్తులకు మెరుగైన సేవలు అందిస్తాం అని హామీ ఇచ్చారు. శ్రీవారిపై భక్తులకు ఉన్న భక్తిభావం, నమ్మకం ఏమాత్రం సన్నగిల్లకుండా చూసుకోవడమే తన ప్రధాన లక్ష్యం అని ఈవో ముద్దాడ రవిచంద్ర పేర్కొన్నారు. తిరుమలలో ఉన్న సమస్యలను, పరిస్థితులను పూర్తిగా అధ్యయనం చేశాకే నిర్ణయాలు తీసుకుంటాను అని టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర వెల్లడించారు. ముందస్తు అంచనాలతో కాకుండా.. క్షేత్రస్థాయిలో పరిశీలించి, భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపడతామన్నారు. దేవుడు ఇచ్చిన శక్తితో, అందరి సహకారంతో భక్తుల సౌకర్యార్థం పని చేస్తాను అని టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర పేర్కొన్నారు.

# జోగి రమేశ్ ఇంటి సమీపంలో వైసీపీ నేత మృతి

**జగన్ పరామర్శ యాత్రలో విషాదం**

విజయవాడ, ఫిబ్రవరి 6 (ఈవార్తలు): వైసీపీ అధినేత జగన్ ఇబ్రహీంపట్నం పర్యటన సందర్భంగా విషాదం చోటుచేసుకుంది. మాజీ మంత్రి జోగి రమేశ్‌ను పరామర్శించేందుకు ఆయన తాడేపల్లి నుంచి ఇబ్రహీంపట్నంకు బయల్దేరారు. ఈ క్రమంలో జోగి రమేశ్ ఇంటి సమీపంలో వైసీపీ నేత మృతి చెందారు. జగన్ వస్తున్న నేపథ్యంలో జోగి రమేశ్ ఇంటికి వెళుతున్న చిల్లకల్లు గ్రామ వైసీపీ అధ్యక్షుడు డి.రాంబాబు పల్స్ పడిపోయి కుప్పకూలారు. వెంటనే ఆయనను సమీప ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆయన చనిపోయినట్టు వైద్యులు నిర్ధారించారు. మరోవైపు కాసేపటి క్రితం జోగి రమేశ్ ఇంటికి జగన్ చేరుకున్నారు. ఆయన ఇంటిని పరిశీలించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. జగన్ పర్యటన సందర్భంగా ఓ కుర్రాడు కూడా మరణించినట్టు తెలుస్తోంది. బైక్ పై విన్యాసాలు చేస్తూ బార్ గేట్ ను ఢీకొనడంతో అతడు మృత్యువాతపడినట్టు సమాచారం. మృతిచెందిన కుర్రాడిని ఇబ్రహీంపట్నంకు చెందిన భార్గవ్ గా గుర్తించారు.

# ప్రతి భక్తుడిపై ధార్మిక బాధ్యత

**హిందూ ధర్మంపై దాడులు జరిగినప్పుడు మౌనం వీడాలి**

**కులం, ప్రాంతం వేరైనా మన ధర్మం ఒక్కటే: పవన్ కల్యాణ్**



అమరావతి, ఫిబ్రవరి 6 (ఈవార్తలు): ప్రతి భక్తుడిపై ధార్మిక బాధ్యత ఉంటుందని, హిందూ దేవుళ్లను, ధర్మాన్ని కించపరిచినప్పుడు మౌనంగా ఉండకుండా తమ గళాన్ని వినిపించాలని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. సగటు హిందువు మనస్తత్వంలో మార్పు రావాలని, భయంతో లేదా సౌలభ్యం కోసం మౌనంగా ఉండే ధోరణిని వీడాలని ఆయన సూచించారు. దేవుడిపై భయం, విశ్వాసంపై గౌరవం ఉన్నప్పటికీ, మన ధర్మాన్ని ఎవరైనా దురుద్దేశంతో అపహాస్యం చేసినప్పుడు కేవలం వ్యక్తిగతంగా బాధపడి, కర్మకు వదిలేసి ముందుకు సాగే అలవాటు మారాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. పవన్ కల్యాణ్ తన అభిప్రాయాలను వివరిస్తూ, "మనం కులం, మతం, ప్రాంతం, భాషల పరంగా విభజనకు గురై ఉండవచ్చు. కానీ మనందరి ధర్మం ఒక్కటే, దేవుళ్లు కూడా అంతే. మన విశ్వాసాలను, ధర్మాన్ని ఉద్దేశపూర్వకంగా అవమానించినప్పుడు మన బాధను తెలియజేయడం మనందరి కర్తవ్యం. ఇలాంటి కీలక సమయాల్లో పాటించే మౌనం సమిష్టి చైతన్యాన్ని బలహీనపరుస్తుంది" అని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరూ కేవలం భక్తులుగా మిగిలిపోకుండా, తమ విశ్వాసాలకు స్పృహతో కూడిన సంరక్షకులుగా కూడా వ్యవహరించాలని ఆయన కోరారు. హిందూ ధర్మాన్ని రక్షించుకోవడమంటే ఇతర మతాలకు వ్యతిరేకంగా ఉండటం కాదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. తమ సొంత విశ్వాసాలను, సంప్రదాయాలను కాపాడుకోవడం మాత్రమేనని ఆయన వివరించారు. హిందువులు తమ ధార్మిక బాధ్యతను గుర్తించి, సోమరితనం వీడి, తమ విశ్వాసాల పరిరక్షణకు సమిష్టిగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మార్పు ద్వారానే హిందూ ధర్మం యొక్క గౌరవాన్ని కాపాడుకోగలమని ఆయన ట్వీట్ చేశారు.

# మోదీ గాంధీని మళ్లీ చంపాడు

## ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల



విజయవాడ, ఫిబ్రవరి 6 (ఈవార్తలు): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇద్దరూ కలిసి సీమ ప్రజలను మోసం చేస్తున్నారు అని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల ఆరోపించారు. చంద్రబాబు, వైఎస్ జగన్ ఇద్దరు సీమ ద్రోహులేనని మండిపడ్డారు. స్వప్రయోజనాల కోసం సీమ ప్రజల ప్రయోజనాలు తాకట్టు పెట్టారు అని మండిపడ్డారు.'రాయలసీమ ఎత్తిపోతల పథకంపై వైసీపీ ఆందోళనలు చేయడానికి సిగ్గుండాలి అని వైఎస్ షర్మిల ఎద్దేవా చేశారు.'రాయలసీమ ఎత్తిపోతల పథకంపై వైసీపీ ఉద్యమాలు చేస్తాం అనడం హాస్యాస్పదం. జగన్ అధికారంలో ఉన్నాడు అని మరిచిపోయాడు. 5 ఏళ్ళు నిద్రపోయాడు అన్న సంగతి కూడా మరిచిపోయాడు. ఇప్పుడే నిద్ర లేచి రాయలసీమ ప్రయోజనం అని కొట్లాడుతాడట.వైసీపీ అధికారంలో ఉండగా రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ఎందుకు పూర్తి చేయలేదు?.'ఎన్జీటీ దగ్గర అనుమతుల కోసం వాదనలు ఎందుకు వినిపించలేదు. అనుమతులు వచ్చేలా కేంద్రాన్ని ఎందుకు ఒప్పించలేదు'అని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల నిలదీశారు. 'ప్రధాని నరేంద్రమోడీకి వైఎస్ జగన్ గత 5 ఏళ్లు దత్తపుత్రుడుగా ఉన్నారు. రాయలసీమ ప్రాజెక్ట్ కావాలని ఎందుకు మోడీపై ఒత్తిడి తేలేదు ?. జగన్ అధికారంలో ఉన్న 5 ఏళ్లలో సీమ ప్రాజెక్టులపై కన్నెత్తి కూడా చూడలేదు. వైఎస్సార్ మొదలు పెట్టిన జలయజ్ఞం ప్రాజెక్టులను 6 నెలల్లో పూర్తి చేస్తాం అన్నారు. జలయజ్ఞం ప్రాజెక్ట్ ల వైపు చూడని వాళ్ళు రాయలసీమ కోసం ఉద్యమాలు చేస్తాం అంటే సిగ్గుచేటు' అని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల మండిపడ్డారు.'ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సైతం రాయలసీమకు అన్యాయం చేస్తున్నారు. ఈ ఎత్తిపోతల పథకం అవసరం లేదు అన్నట్లు మాట్లాడుతున్నాడు. ముచ్చిమర్రి దగ్గర నుంచి లిఫ్ట్ పెట్టి సీమకు నీళ్లు పారిస్తారట. చంద్రబాబు నాయుడు, జగన్‌లు కలిసి సీమ ప్రజలను మోసం చేస్తున్నారు. చంద్రబాబు, జగన్ ఇద్దరు సీమ ద్రోహులే. స్వప్రయోజనాల కోసం సీమ ప్రజల ప్రయోజనాలు తాకట్టు పెట్టారు. ఇద్దరు మోదీ దగ్గర సాగిలపడి సీమకు తీరని అన్యాయం చేస్తున్నారు'అని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు.

# పులి పట్టుబడింది!

**ఆరు రోజులుగా భయపెడుతున్న పెద్ద పులి**

**తూర్పుగోదావరి జిల్లాలో**

**విజయవంతమైన రెస్క్యూ ఆపరేషన్**



రాయవరం, ఫిబ్రవరి 6 (ఈవార్తలు): ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా ప్రజలను గత ఆరు రోజులుగా తీవ్ర భయాందోళనలకు గురిచేసిన పెద్ద పులి ఎట్టకేలకు చిక్కింది. శుక్రవారం సాయంత్రం అటవీ శాఖ అధికారులు చేపట్టిన భారీ ఆపరేషన్ విజయవంతం కావడంతో మండపేట, రాయవరం, రాజానగరం మండలాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. సుదీర్ఘ ఉత్కంఠకు తెరదించుతూ, మత్తు ఇంజెక్షన్ సహాయంతో పులిని సురక్షితంగా బంధించారు. వివరాల్లోకి వెళితే, గత ఆరు రోజులుగా తూర్పుగోదావరి జిల్లాలోని రఘునాథపురం, జి.యర్రంపాలెం, కూర్మాపురం వంటి గ్రామాల్లో ఈ పులి సంచరిస్తూ సుమారు తొమ్మిది పశువులను, దూడలను చంపేసింది. దీంతో స్థానికులు కంటి మీద కునుకు లేకుండా గడిపారు. శుక్రవారం ఉదయం మండపేట నియోజకవర్గంలోని కూర్మాపురంలో ఒక పాడుబడిన ఇంట్లో పులి గాండ్రింపులు వినిపించడంతో గ్రామస్థులు అటవీ శాఖకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు, రెవెన్యూ, అటవీ శాఖ సిబ్బంది అక్కడికి చేరుకుని ఆపరేషన్ ప్రారంభించారు. పుణే, ఢిల్లీల నుంచి వచ్చిన నిపుణుల బృందాలు రంగంలోకి దిగి, పులిని మత్తు ఇంజెక్షన్‌తో బంధించేందుకు ప్రయత్నించాయి. అయితే, మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో ఆపరేషన్‌కు ఊహించని ట్విస్ట్ ఎదురైంది. అధికారుల కళ్లుగప్పి పులి ఒక్కసారిగా గోడ దూకి, సమీపంలోని పంట పొలాల్లోకి పారిపోయింది. వేలాది మంది చూస్తుండగానే క్షణాల్లో అదృశ్యం కావడంతో తీవ్ర కలకలం రేగింది. అయినప్పటికీ, పట్టువదలని అటవీ శాఖ బృందాలు థర్మల్ డ్రోన్లు, ట్రాప్ కెమెరాల సహాయంతో దాని కదలికలను నిరంతరం గమనించాయి. చివరకు సాయంత్రం కొత్త చెరువు సమీపంలో పులిని గుర్తించి, చాకచక్యంగా మత్తు ఇంజెక్షన్ ప్రయోగించి బంధించారు. మహారాష్ట్ర నుంచి తెలంగాణ మీదుగా గోదావరి నది దాటి ఇక్కడికి వచ్చిన ఈ మగ పులిని ఇప్పుడు దాని సహజ ఆవాసానికి తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

# ఏపీ హైకోర్టులో అంబటి 7 క్వాష్ పిటిషన్లు




అమరావతి, ఫిబ్రవరి 6 (ఈవార్తలు): ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు ప్రస్తుతం రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉన్న సంగతి తెలిసిందే. మరోవైపు ఆయనపై పట్టాభిపురం, మంగళగిరి, నగరంపాలెం, నల్లపాడు పోలీస్ స్టేషన్ల పరిధిలో కేసులు నమోదయ్యాయి. తనపై నమోదైన కేసులను కొట్టివేయాలని కోరుతూ ఏపీ హైకోర్టులో ఆయన 7 క్వాష్ పిటిషన్లు దాఖలు చేశారు. ఇప్పటికే నల్లపాడు పీఎస్ లో నమోదైన కేసుకు సంబంధించి దాఖలైన క్వాష్ పిటిషన్ పై విచారణను ఈ నెల 11వ తేదీకి హైకోర్టు వాయిదా వేసింది. మంగళగిరి పీఎస్ లో నమోదైన కేసులో తప్పనిసరిగా బీఎన్ఎస్ 35(3)ను అనుసరించాలని మంగళగిరి పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. మిగిలిన 5 కేసులకు సంబంధించిన క్వాష్ పిటిషన్లు సోమవారం విచారణకు వచ్చే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఈ క్వాష్ పిటిషన్లపై హైకోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే దానిపై సర్వత్ర ఆసక్తి నెలకొంది. మరోవైపు, అంబటిపై పీటీ వారెంట్ పొందేందుకు మంగళగిరి కోర్టులో పోలీసులు పిటిషన్ దాఖలు చేసినట్టు తెలుస్తోంది.

# కాపులంటే బాబుకు కక్ష: అమర్నాథ్

తాడేపల్లి, ఫిబ్రవరి 6 (ఈవార్తలు): కాపులంటే ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు కక్ష అని మాజీ మంత్రి, వైసీపీ నేత గుడివాడ అమర్నాథ్ ఆరోపించారు. కాపులను కూటమి ప్రభుత్వం టార్గెట్ చేసిందని అన్నారు. కాపులపై చంద్రబాబు కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. వంగవీటి రంగాను హత్య చేశారని, ముద్రగడను కూడా పలు రకాలుగా వేధించారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ఆటవిక పాలన నడుస్తోందని అమర్నాథ్ అన్నారు. అంబటి రాంబాబు మీద దాడి చేసి ఆయనపైనే తప్పుడు కేసు పెట్టారని మండిపడ్డారు. అంబటి రాంబాబు కుటుంబానికి సంఘీభావం తెలిపేందుకు రేపు ఉదయం వెళుతున్నామని చెప్పారు. తమది సంఘీభావ యాత్ర మాత్రమేనని, రాజకీయ యాత్ర కాదని అన్నారు. అంబటి రాంబాబుపై తప్పుడు కేసు విషయంలో న్యాయపరంగా పోరాటం చేస్తామని చెప్పారు. తాను నాస్తికుడినని గతంలో చెప్పుకున్న జనసేన ఎమ్మెల్సీ నాగబాబు ఇప్పుడు సనాతన ధర్మం అని ఎలా మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. తిరుమల కల్తీ లడ్డూపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్టాండ్ ఎప్పటికప్పుడు మారిపోతోందని ఎద్దేవా చేశారు. తిరుమల లడ్డూకు వాడిన నెయ్యిలో జంతు కొవ్వు లేదని సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన సిట్ నివేదిక వెల్లడించిందని... ఇప్పుడు మళ్లీ దీనిపై కమిటీ ఎందుకని ప్రశ్నించారు. లడ్డూలో జంతు కొవ్వు ఉందని చెప్పించడం కోసమే కమిటీ వేస్తున్నారా? అని నిలదీశారు.

# మోదీని తిట్టిపోశారు

**చంద్రబాబు, బాలయ్యపై రోజా ఫైర్**

విజయవాడ, ఫిబ్రవరి 6 (ఈవార్తలు): మాజీ మంత్రి, వైసీపీ నేత జోగి రమేశ్ ఇంటిపై జరిగిన దాడిని ఆ పార్టీ మహిళా నేత, మాజీ మంత్రి రోజా ఖండించారు. ఇబ్రహీంపట్నంలోని జోగి రమేశ్ ఇంటికి రోజా వెళ్లారు. జోగి రమేశ్‌ను, ఆయన కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించారు. ఆయన ఇంటిని పరిశీలించారు. అనంతరం రోజా మీడియాతో మాట్లాడుతూ... జోగి రమేశ్, అంబటి రాంబాబు నివాసాలపై దాడుల వెనుక ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఉన్నారని అన్నారు. వీరిని చూసుకునే టీడీపీ శ్రేణులు బరితెగించాయని మండిపడ్డారు. జోగి రమేశ్ కుటుంబాన్ని కూటమి ప్రభుత్వం గత 18 నెలలుగా సాధిస్తోందని రోజా అన్నారు. గతంలో జోగి రమేశ్, ఆయన కుమారుడు, ఆయన భార్యపై కేసులు పెట్టారని మండిపడ్డారు. తిట్టిన ప్రతి ఒక్కరి ఇళ్లపై రాళ్లు రువ్వి, పెట్రోల్ పోసి తగలబెట్టాలనుకుంటున్నారని... ప్రధాని మోదీని చంద్రబాబు, బాలకృష్ణలు ఇష్టానుసారం తిట్టారని, వారి ఇళ్లను ఏం చేయాలని ప్రశ్నించారు.

# నేడు క్వాంటం వ్యాలీకి భూమిపూజ

అమరావతి, ఫిబ్రవరి 6 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఒక సరికొత్త సాంకేతిక అధ్యాయానికి నాంది పలుకుతూ, అమరావతి శనివారం ఒక చారిత్రక ఘట్టానికి వేదిక కానుంది. ప్రపంచ క్వాంటం టెక్నాలజీ రంగంలో రాష్ట్రాన్ని, దేశాన్ని అగ్రగామిగా నిలిపే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'అమరావతి క్వాంటం వ్యాలీ' భవన నిర్మాణానికి శనివారం పునాదిరాయి పడనుంది. ఈ కీలక కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి జితేంద్ర సింగ్ హాజరుకానున్నారు.

# ఓడిపోయాక కోర్టుకు వస్తారా?



**ప్రశాంత్ కిశోర్‌పై సుప్రీం ఫైర్**

న్యూఢిల్లీ: ప్రముఖ రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ స్థాపించిన 'జన్ సురాజ్' పార్టీకి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. 2025 బీహార్ అసెంబ్లీ ఎన్నికలను రద్దు చేసి, కొత్తగా పోలింగ్ నిర్వహించాలని కోరుతూ ఆ పార్టీ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను విచారించేందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. పాట్నా హైకోర్టును ఆశ్రయించేందుకు పిటిషనర్‌కు స్వేచ్ఛనిస్తూ, పిటిషన్‌ను ఉపసంహరించుకున్నట్లుగా పరిగణిస్తున్నట్లు పేర్కొంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. జన్ సురాజ్ తరఫున సీనియర్ న్యాయవాది చందర్ ఉదయ్ సింగ్ వాదనలు వినిపించారు. ఎన్నికల సమయంలో అధికార పార్టీ 'ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన' కింద మహిళలకు రూ.10,000 చొప్పున పంపిణీ చేసిందని, ఇది ఓటర్లను ప్రలోభపెట్టడం, లంచం ఇవ్వడం కిందకే వస్తుందని ఆరోపించారు. తీవ్ర ఆర్థిక ఒత్తిడిలో ఉన్న బీహార్‌లో ఇలాంటి పథకం ద్వారా ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని పేర్కొన్నారు. ఈ వాదనలపై ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. "మీకు ఎన్ని ఓట్లు వచ్చాయి? ప్రజలు తిరస్కరించిన తర్వాత ఉపశమనం కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తారా?" అని ఘాటుగా ప్రశ్నించింది. ఈ పథకంపై అభ్యంతరం ఉంటే సరైన సమయంలోనే సవాల్ చేయాల్సిందని అభిప్రాయపడింది. మొత్తం ఎన్నికల ప్రక్రియను రద్దు చేయాలని కోరడం సరికాదని వ్యాఖ్యానించింది. దేశవ్యాప్తంగా ఉచిత పథకాలపై దాఖలైన ఇతర పిటిషన్లపై విచారణను కొనసాగిస్తామని స్పష్టం చేసిన ధర్మాసనం, ఎన్నికల్లో ఓడిపోయిన పార్టీ వేసిన ఈ పిటిషన్‌ను మాత్రం విచారించలేమని తేల్చిచెప్పింది. పిటిషనర్ సదుద్దేశాన్ని కూడా పరిశీలించాల్సి ఉంటుందని పేర్కొంది. దీంతో పిటిషనర్ తరఫు న్యాయవాది పాట్నా హైకోర్టును ఆశ్రయించేందుకు అనుమతి కోరగా, ధర్మాసనం అంగీకరించింది.



# మోదీకి అంత దమ్ము లేదు

**మా ప్రశ్నలకు భయపడుతున్నారు**

**కాంగ్రెస్ చీఫ్ ఖర్గే ఆరోపణలు**



న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్రమోదీపై కాంగ్రెస్ పార్టీ జాతీయాధ్యక్షుడు, రాజ్యసభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే తీవ్ర విమర్శలు చేశారు. గురువారం రాజ్యసభలో ప్రధాని చేసిన ప్రసంగంలో పనికొచ్చే అంశం ఒక్కటి కూడా లేదని ఎద్దేవా చేశారు. మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్య పద్ధతిలో పార్లమెంట్‌ను నడపడం లేదని విమర్శించారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఖర్గే.. నరేంద్రమోదీ అబద్ధాలు మళ్లీమళ్లీ చెప్పడమే తన పనిగా పెట్టుకున్నారని ఖర్గే ఎద్దేవా చేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై రాజ్యసభలో జరిగిన చర్చకు ప్రధాని గురువారం సమాధానమిచ్చారు. అయితే ప్రధాని 97 నిమిషాల సమాధానంలో ఒక్కటైన్నా ముఖ్యమైన విషయంగానీ, తప్పనిసరి విషయంగానీ లేదని అన్నారు. రాష్ట్రపతి ప్రసంగంపై తాము చేసిన ప్రతిపాదనల్లో ఒక్కదానికి కూడా ప్రధాని స్పందించలేదని ఖర్గే చెప్పారు. ఆయన కేవలం 100 ఏళ్లు, 75 ఏళ్లు, 50 ఏళ్లు అని ఏదేదో మాట్లాడారని ఎద్దేవా చేశారు. తమ నాయకుడు రాహుల్‌గాంధీ ఆర్మీ మాజీ చీఫ్ నరవణె పుస్తకం విషయాన్ని ప్రస్తావించంగానే అధికార పక్షం మొత్తానికి నొప్పి కలిగిందని ఖర్గే వ్యాఖ్యానించారు.

## ఇరాన్‌లో భారతీయులపై నజర్: జైశంకర్



టెహ్రాన్: ఇరాన్‌లోని భారతీయుల విషయమై విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ పార్లమెంట్ వేదికగా స్పందించారు. ఇరాన్‌లో పరిస్థితులను ఎప్పటికప్పుడు నిశితంగా గమనిస్తున్నామని తెలిపారు. అక్కడి భారత విద్యార్థులకు నిత్యం అడ్వైజరీ జారీ చేస్తున్నట్లు చెప్పారు. టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం వారితో నిత్యం టచ్‌లోనే ఉంటోందని వెల్లడించారు. అవసరమైన సమయాల్లో సలహాలు ఇవ్వడంతో పాటు తగిన సాయం అందిస్తోందని అన్నారు. ఇరాన్ గగనతలం తెరిచే ఉందని, ఇరుదేశాల మధ్య విమాన సర్వీసులు నడుస్తున్నాయని, కాబట్టి అక్కడి భారతీయులను ఇరాన్‌లో చిక్కుకుపోయిన వారిగా పరిగణించడం లేదని అన్నారు. ఆ కారణంగానే ప్రత్యేకంగా తరలింపు ప్రక్రియ చేపట్టలేదని స్పష్టం చేశారు. ఇరాన్‌లోని 16 రాష్ట్రాల్లో ప్రస్తుతం 9 వేల నుంచి 10 వేల మంది భారతీయులు ఉన్నారని జైశంకర్ వెల్లడించారు. ఇందులో ఎక్కువ మంది విద్యార్థులే ఉన్నారని తెలిపారు. కార్మికులు, యాత్రికులు, పర్యాటకులు, వ్యాపారవేత్తలు, నావికులు కూడా ఉన్నట్లు తెలిపారు. స్వదేశానికి రావాలనుకునే భారతీయులకు విమానాలు అందుబాటులోనే ఉన్నాయని స్పష్టం చేశారు.

## అమెరికాలో 89 మంది భారతీయ క్రిమినల్స్

వాషింగ్టన్: అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపుతున్న అమెరికా.. వేలాది మందిని అదుపులోకి తీసుకుంటున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో వివిధ కేసుల్లో ఉన్న 25వేల మంది వలసదారులను ఇమిగ్రేషన్ అధికారులు అరెస్టు చేయగా.. ఇందులో అత్యంత తీవ్ర నేరస్థుల జాబితాలో 89 మంది భారతీయులు ఉన్నట్లు తెలిసింది. అమెరికా అధికారులు అరెస్టు చేసిన నేరస్థులు, అక్రమ వలసదారులకు సంబంధించిన జాబితాను అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం బహిర్గతం చేసింది. వీరి పేర్లు, మగ్‌షాట్స్, అరెస్టు చేసిన ప్రదేశం, తదితర వివరాలను దేశాల వారీగా పొందుపరిచింది. ఈ జాబితాలో ఉన్న 89 మంది భారతీయుల్లో ఎక్కువ మంది ఆర్థిక, హింసాత్మక ఘటనలకు పాల్పడినవారేనని ఉన్నట్లు సమాచారం.

## కెనడాలో ఏడేళ్లలో 17 మంది భారతీయులు మృతి

ఒట్టావా: విదేశాల్లో చోటుచేసుకున్న హింసాత్మక దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన భారతీయ విద్యార్థులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కీలక విషయం వెల్లడించింది. గడిచిన ఏడేళ్లలో (2018-2025 మధ్య కాలంలో) కెనడాలో అత్యధికంగా 17 మంది భారతీయ విద్యార్థులు ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపింది. అమెరికాలో తొమ్మిది, ఆస్ట్రేలియాలో ముగ్గురు, కిర్గిజిస్థాన్‌లో ఇద్దరు, బ్రిటన్, చైనా, డెన్మార్క్, జర్మనీ, గ్రెనడాలలో ఒకరు చొప్పున ప్రాణాలు కోల్పోయినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. విదేశాల్లో భారతీయ విద్యార్థులపై హింసాత్మక ఘటనలు పెరుగుతున్న విషయంపై ప్రభుత్వానికి అవగాహన ఉందా? వీటిపై సకాలంలో దర్యాప్తు జరుగుతోందా? అని ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అడిగిన ప్రశ్నకు విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ ఈ మేరకు లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. విదేశాల్లోని భారతీయ విద్యార్థుల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, వారిపై జరిగే దాడులు.. హింసాత్మక ఘటనలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామని చెప్పారు.

## 50 లక్షలు దాటిన ఫాస్టాగ్ వార్షిక యూజర్లు

న్యూఢిల్లీ: జాతీయ రహదారులపై టోల్ భారాన్ని తగ్గించే ఉద్దేశంతో తీసుకొచ్చిన ఫాస్టాగ్ వార్షిక పాస్‌కు వాహనదారుల నుంచి అద్భుత స్పందన లభిస్తోంది. దేశవ్యాప్తంగా ఈ పాస్‌ను తీసుకున్న వినియోగదారుల సంఖ్య 50 లక్షలు దాటింది. ఇప్పటివరకు 26.55 కోట్ల లావాదేవీలు జరిగినట్లు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. వార్షిక పాస్ వినియోగంలో చండీగఢ్ అగ్రస్థానంలో ఉంది. దేశవ్యాప్తంగా జరిగే మొత్తం వార్షిక పాస్ లావాదేవీల్లో 14 శాతం ఈ ప్రాంతం నుంచే జరుగుతున్నట్లు మంత్రిత్వ శాఖ తెలిపింది. తమిళనాడు (12.3 శాతం), ఢిల్లీ (11.5 శాతం) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. న్యూఢిల్లీ రాజధాని ప్రాంతంలోని బిజ్వాసన్ ప్లాజా వద్ద వార్షిక పాస్ వినియోగం అధికంగా ఉంది. ఈ టోల్‌గేట్‌ను దాటే మొత్తం కార్లలో 57 శాతం వార్షిక పాస్‌ను వినియోగించినట్లు గణాంకాలు పేర్కొన్నారు. ఇదే ప్రాంతంలో ఉన్న ముందాక, సోనిపట్‌లోని జింజోలి టోల్ ప్లాజాలు 53 శాతంతో తర్వాతి స్థానాల్లో నిలిచాయి. దేశంలో 1150 జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్ వేలపై టోల్‌ప్లాజాల వద్ద చెల్లుబాటు అయ్యేలా గతేడాది ఆగస్టు 15న ఫాస్టాగ్ వార్షిక పాస్‌ను తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఒక్కసారి రూ.3 వేలు చెల్లిస్తే ఏడాది పాటు లేదా 200 టోల్ క్రాసింగులకు ఈ పాస్ పనిచేస్తుంది. నాన్ కమర్షియల్ వాహనాలకు ఇది వర్తిస్తుంది. రాజమార్గ్ యాత్ర లేదా ఎన్‌హెచ్‌ఏఐ వెబ్‌సైట్ ద్వారా చెల్లింపులు చేసిన రెండు గంటల్లోనే ఈ పాస్ యాక్టివేట్ చేసుకోవచ్చు. ఒక్కో టోల్ గేట్ దాటేందుకు అయ్యే ఖర్చు రూ.15 మాత్రమేనని కేంద్రం పేర్కొంది.

# కోవిడ్ టీకాలకు వంధ్యత్వానికి లింక్ లేదు!

**ఎలాంటి సంబంధం లేదని అధ్యయనంలో వెల్లడి.. స్వీడన్‌లో 60,000 మంది మహిళలపై పరిశోధన**




లండన్: కోవిడ్ వ్యాక్సిన్ల వల్ల సంతానోత్పత్తి సామర్థ్యం తగ్గుతుందంటూ వచ్చిన వదంతుల్లో ఎంతమాత్రం నిజం లేదని ఓ అధ్యయనం స్పష్టం చేసింది. కోవిడ్ టీకా తీసుకోవడం వల్ల పిల్లలు పుట్టే అవకాశాలపై ఎలాంటి ప్రతికూల ప్రభావం ఉండదని ఈ పరిశోధనలో తేలింది. ముఖ్యంగా సోషల్ మీడియాలో విపరీతంగా ప్రచారమైన అపోహలకు ఈ అధ్యయనం చెక్ పెట్టింది. స్వీడన్‌లోని లింకోపింగ్ యూనివర్సిటీ పరిశోధకులు ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. 18 నుంచి 45 ఏళ్ల మధ్య వయసున్న దాదాపు 60,000 మంది మహిళలపై జరిపిన ఈ పరిశోధన వివరాలను 'కమ్యూనికేషన్స్ మెడిసిన్' అనే ప్రముఖ సైన్స్ జర్నల్‌లో ప్రచురించారు. వ్యాక్సిన్ తీసుకున్న వారికి, తీసుకోని వారికి మధ్య జననాల రేటులో గానీ, గర్భస్రావాల రేటులో గానీ గణాంకపరంగా ఎటువంటి తేడా లేదని ఈ అధ్యయనం నిర్ధారించింది. "మహమ్మారి సమయంలో జననాల రేటు తగ్గడానికి ఎంఆర్ఎన్ఏ కోవిడ్-19 వ్యాక్సిన్లు కారణం అనడానికి ఎలాంటి ఆస్కారం లేదు. వ్యాక్సిన్ తీసుకున్న, తీసుకోని మహిళల మధ్య జననాల రేటులో మేము ఏ తేడానూ గమనించలేదు" అని అధ్యయనానికి నేతృత్వం వహించిన ప్రొఫెసర్ టూమాస్ టింప్కా తెలిపారు. కోవిడ్ మహమ్మారి సమయంలో స్వీడన్ వంటి కొన్ని దేశాల్లో జననాల రేటు తగ్గడంతో దీనికి వ్యాక్సిన్లే కారణమా? అనే అనుమానాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో నిర్వహించిన ఈ పరిశోధన ప్రాధాన్యం సంతరించుకుంది. గతంలో జరిగిన చాలా అధ్యయనాలు సంతాన సాఫల్య చికిత్స తీసుకుంటున్న జంటలపై దృష్టి సారించగా, ఈ అధ్యయనం మాత్రం సాధారణ జనాభాలో గర్భధారణ అవకాశాలను పరిశీలించింది. వయసు, ఇతర అనారోగ్య సమస్యల వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుని ఫలితాలను విశ్లేషించారు. కోవిడ్ ఇన్ఫెక్షన్ గర్భవతులకు ప్రమాదకరమని, అయితే వ్యాక్సిన్ ఆ రిస్క్‌ను గణనీయంగా తగ్గిస్తుందని పలు అధ్యయనాలు ఇప్పటికే నిరూపించాయి. అందువల్ల కుటుంబ జీవితం ప్రారంభించాలనుకునే మహిళలు కోవిడ్ వ్యాక్సిన్ తీసుకునే విషయంలో ఎలాంటి సంకోచం పెట్టుకోవద్దని ప్రొఫెసర్ టింప్కా స్పష్టం చేశారు.

# బంగ్లాలో మళ్లీ ఆందోళనలు


**యూనస్ ఇంటి ముందు ఉద్యోగుల నిరసన**




ఢాకా: బంగ్లాదేశ్‌లో మరో వారం రోజుల్లో ఎన్నికలు జరగబోతున్నాయి. అయితే, ఎన్నికలకు ముందు బంగ్లా రాజధాని ఢాకాలో మరోసారి ఆందోళనలు మిన్నంటాయి. బంగ్లాదేశ్ తాత్కాలిక దేశాధినేత ముహమ్మద్ యూనస్ ఇంటి వద్ద ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఆందోళన చేశారు. తమకు వేతనాలు పెంచాలని, తొమ్మిదవ పే స్కేల్ అమలు చేయాలని కోరుతూ ఢాకాలోని యూనస్ అధికారిక నివాసం వద్ద ఆందోళన బాటపట్టారు. శుక్రవారం ఉదయం నుంచి వారు నిరసన ప్రదర్శన చేస్తున్నారు. కొత్త ప్రభుత్వం ఎన్నికైతే మళ్లీ తమకు వేతనాల పెంపు ఉండదని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. అందుకే నిరసనలకు దిగారు. అయితే, ఆందోళనకారుల్ని అడ్డుకునేందుకు అక్కడి భద్రతా దళాలు ప్రయత్నించాయి. దీంతో అటు ఆందోళనకారులకు, ఇటు భద్రతా సిబ్బందికి మధ్య ఘర్షణ తలెత్తింది. ఈ ఘర్షణల్లో 15 మంది వరకు గాయపడ్డట్లు తెలుస్తోంది. హై సెక్యూరిటీ ఉన్న యూనస్ ఇంటిలోపలికి చొచ్చుకెళ్లేందుకు నిరసనకారులు ప్రయత్నించారు. బారికేడ్లు తొలగించి, గేట్లు ఎక్కి మరీ ఇంట్లోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో వారిని అడ్డుకునేందుకు పోలీసులు లాఠీచార్జి చేశారు. వాటర్ కెనాన్లు ప్రయోగించారు. అయినప్పటికీ ఆందోళనకారుల్ని అడ్డుకోలేకపోయారు. పైగా వీరు పోలీసులపై తిరుగబడ్డారు. ఇరువర్గాల తోపులాటతో ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ ఘటనల్లో 15 మంది గాయపడ్డారు. బంగ్లాదేశ్‌లో 2024లో షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోయిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి.. అంటే 18 నెలలుగా బంగ్లాలో తాత్కాలిక ప్రభుత్వమే నడుస్తోంది. అందుకే కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకునేందుకు ఈనెల 12న దేశవ్యాప్తంగా ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికలు ప్రశాంతంగా జరిపేందుకు యూనస్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నామని చెబుతోంది. కానీ, ఆందోళనలు మాత్రం ఆగడం లేదు.

# అవాంఛిత గర్భం తొలగించుకోవచ్చు!

**గర్భం కొనసాగించాలని ఒత్తిడి చేయలేం: సుప్రీం**



న్యూఢిల్లీ: ఏ మహిళను కూడా తాము ఇష్టంలేని గర్భం కొనసాగించాలని ఒత్తిడి చేయలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అవాంఛిత గర్భధారణకు సంబంధించి సర్వోన్నత న్యాయస్థానం ఈవిధంగా స్పందించింది. తనకు ఇష్టం లేకపోయినా గర్భం కొనసాగించాలని తాము ఏ మహిళను ఒత్తిడి చేయలేమని పేర్కొంది. మైనర్‌గా ఉండి గర్భవతి అయిన ఓ బాలిక 30 వారాల గర్భాన్ని వైద్యపరంగా తొలగించుకునేందుకు అనుమతి కోరుతూ పిటిషన్ వేసింది. దాంతో గర్భవిచ్ఛిత్తికి ఆమెకు అనుమతినిస్తూ కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. గర్భవిచ్ఛిత్తికి నిరాకరిస్తూ బాంబే హైకోర్టు ఇటీవల ఇచ్చిన ఆదేశాలను సుప్రీం ధర్మాసనం పక్కనపెట్టింది. కాగా మహారాష్ట్రకు చెందిన ఓ మైనర్ బాలిక స్నేహితుడితో సంబంధం కారణంగా కొన్ని నెలల క్రితం గర్భం దాల్చింది. అప్పుడు ఆమె వయసు 17 ఏళ్లు. ప్రస్తుతం ఆమె వయసు 18 సంవత్సరాల నాలుగు నెలలు. ఇప్పుడు ఆమె 30 వారాల గర్భిణిగా ఉంది. ఈ క్రమంలో గర్భవిచ్ఛిత్తి కోసం అమ్మాయి తొలుత బాంబే హైకోర్టును ఆశ్రయించగా.. మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ చట్టం ప్రకారం గడువు మించిపోవడంతో కోర్టు అందుకు నిరాకరించింది. దాంతో ఈ కేసు సుప్రీంకోర్టుకు చేరింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌తో కూడిన సుప్రీం ధర్మాసనం విచారణ చేపట్టింది. గర్భిణి నిర్ణయానికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలని, ముఖ్యంగా గర్భధారణ కొనసాగింపుపై అయిష్టత వ్యక్తం చేసిన పరిస్థితుల్లో ఆమె స్వేచ్ఛకు వదలివేయాలని సూచించింది. అయితే ఈ కేసులో పిండం కూడా ఒక ప్రాణమే అయినప్పటికీ మరో మార్గం లేదని పేర్కొంది. ఎంటీపీ చట్టం ప్రకారం గడువు ముగిసినప్పటికీ గర్భవిచ్ఛిత్తి జరుగుతున్న సందర్భాలు అనేకం ఉన్నాయని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. ఇలాంటి సందర్భాల్లో బాధితులు ఎక్కడికి వెళ్తారనే ప్రశ్నను ధర్మాసనం లేవనెత్తింది. నకిలీ, అనధికార వైద్యుల వద్దకు వెళ్తారని, అది మరింత ప్రమాదకరమని చెప్పింది. ఈ కేసులో గర్భవిచ్ఛిత్తికి అనుమతించినా అమ్మాయికి ఎలాంటి ప్రమాదం ఉండదని వైద్యులు ఇచ్చిన నివేదికను పరిగణనలోకి తీసుకొన్న ధర్మాసనం తాజా తీర్పు చెప్పింది.



## మ్యాన్ హోల్ మూతలెత్తుకెళ్లిపోతున్నారు!

**పాక్‌లో దారుణ పరిస్థితులు.. కఠిన శిక్ష ఆదేశాలు**

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లో ఆర్థిక అనిశ్చితి తీవ్రంగా ఉంది. ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం 45 శాతం పౌరులు పాకిస్థాన్‌లో పేదరికంలో ఉన్నారు. ఇప్పుడక్కడ మ్యాన్ హోల్ మూతలను దొంగిలించే స్థాయికి, అలా దొంగిలించిన వారికి 10 సంవత్సరాల జైలు శిక్ష విధిస్తామని ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసే స్థాయికి ఆర్థిక ఇబ్బందులు చేరుకున్నాయి. పాకిస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో మ్యాన్ హోల్స్ మూతలు మాయమవుతున్నాయి. వాటిని ఇలా అమర్చగానే అలా ఎత్తుకుపోతున్నారు. దీంతో పంజాబ్ రాష్ట్ర ముఖ్యమంత్రి మరియం నవాజ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మ్యాన్ హోల్స్ మూతలు ఎత్తుకుపోవద్దని విజ్ఞప్తి చేస్తూ మరియం నవాజ్ వీడియోను విడుదల చేశారు. ఉదయం మ్యాన్ హోల్స్ మూతలు వేస్తున్నామని, రాత్రికల్లా అవి మాయమవుతున్నాయని ఆమె పేర్కొన్నారు. వాటిని దొంగిలించవద్దని ప్రజలకు ఆమె విజ్ఞప్తి చేశారు. దొంగిలించిన మ్యాన్ హోల్స్ మూతలు అమ్మడం లేదా కొనడం చేస్తే ఏడాది నుంచి 10 సంవత్సరాల జైలు శిక్ష విధిస్తామని హెచ్చరించారు. మ్యాన్ హోల్‌లో పడి ఎవరైనా మరణిస్తే బాధ్యులకు పదేళ్ళ జైలు శిక్ష, 50 లక్షల పాకిస్థానీ రూపాయల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. పాకిస్థాన్‌లో మ్యాన్ హోల్స్ మూతలు దాదాపు 30 కిలోలు ఉంటాయి. వాటిని ఎత్తుకెళ్లి స్క్రాప్ మార్కెట్‌లో అమ్మి సొమ్ము చేసుకుంటున్నట్లు స్థానిక మీడియాలో కథనాలు వచ్చాయి. ఈ మూత లేకపోవడం వల్ల లాహోర్‌లో ఒక మ్యాన్ హోల్‌లో పడి తల్లీకూతుళ్లు ప్రాణాలు కోల్పోయారు.

## గ్రీన్‌లాండ్‌లో ఫ్రాన్స్ కాన్సులేట్

**ఈయూ దేశాల్లో తొలి దేశంగా గుర్తింపు**

**కెనడా కూడా దౌత్య కార్యాలయం ఏర్పాటు**

నూక్: ఆర్కిటిక్ ప్రాంతంలో వ్యూహాత్మకంగా కీలకమైన గ్రీన్‌లాండ్‌లో ఫ్రాన్స్ తన కాన్సులేట్‌ను ప్రారంభించింది. డెన్మార్క్ పరిధిలోని ఈ స్వయం ప్రతిపత్తి గల ప్రాంతంలో దౌత్య కార్యాలయాన్ని ఏర్పాటు చేసిన తొలి యూరోపియన్ యూనియన్ (ఈయూ) దేశంగా ఫ్రాన్స్ నిలిచింది. ఈ విషయాన్ని ఫ్రాన్స్ విదేశాంగ మంత్రిత్వ శాఖ శుక్రవారం ప్రకటించింది. గ్రీన్‌లాండ్ రాజధాని నూక్‌లో కాన్సుల్ జనరల్‌గా జీన్-నోయెల్ పోయిరియర్ బాధ్యతలు స్వీకరించినట్లు వెల్లడించింది. గత ఏడాది జూన్‌లో గ్రీన్‌లాండ్‌లో పర్యటించినప్పుడే ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ఈ కాన్సులేట్ ఏర్పాటు ప్రణాళికను ప్రకటించారు. శాస్త్రీయ సహకారాన్ని ప్రోత్సహించడం, పెట్టుబడులు పెట్టాలనుకునే ఫ్రెంచ్ కంపెనీలకు సలహాలు ఇవ్వడం, గ్రీన్‌లాండ్ భూగర్భంలోని ఖనిజ సంపదను గుర్తించడంలో స్థానిక అధికారులతో కలిసి పనిచేయడం వంటివి ఈ కాన్సులేట్ ప్రధాన లక్ష్యాలని ఫ్రెంచ్ అధికారులు తెలిపారు. గ్రీన్‌లాండ్‌పై ఫ్రాన్స్ మాత్రమే కాదు, ఇతర దేశాలు కూడా దృష్టి సారిస్తున్నాయి. ఫ్రాన్స్‌తో పాటు కెనడా కూడా శుక్రవారం నూక్‌లో తన కాన్సులేట్‌ను ప్రారంభించనుంది. మరోవైపు, ఆర్కిటిక్ ప్రాంతంలో నిఘాను పెంచేందుకు నాటో 'ఆర్కిటిక్ సెంట్రీ' పేరుతో సైనిక ప్రణాళికలను ప్రారంభించినట్లు ఓ అధికారి ధ్రువీకరించారు. గ్రీన్‌లాండ్‌ను కొనుగోలు చేయాలని అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గతంలో పలుమార్లు వ్యాఖ్యానించడం తెలిసిందే. అమెరికాతో దౌత్య చర్చలు మళ్లీ మొదలైనప్పటికీ, గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకోవాలనే కోరిక వాషింగ్టన్‌కు ఇంకా ఉందని గ్రీన్‌లాండ్ ప్రధాని జెన్స్-ఫ్రెడెరిక్ నీల్సన్ ఇటీవల పేర్కొన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఆర్కిటిక్‌పై పట్టు సాధించే అంతర్జాతీయ ప్రయత్నాల్లో భాగంగానే ఈ దౌత్య కార్యాలయాల ఏర్పాటును విశ్లేషకులు చూస్తున్నారు.

వయ్యారి చిత్రం







## 11న జీ5 ఓటీటీలోకి 'మన శంకర వరప్రసాద్ గారు'

మెగాస్టార్ చిరంజీవి, నయనతార నటించిన లేటెస్ట్ బ్లాక్ బస్టర్ మూవీ 'మన శంకర వర ప్రసాద్ గారు'. ఈ కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ సంక్రాంతి స్పెషల్‌గా వచ్చి సూపర్ హిట్ సక్సెస్ అందుకుంది. ఇప్పుడు ఓటీటీ ప్రియులను పలకరించేందుకు సిద్ధం అవుతున్నది. ఈ మేరకు ఫిబ్రవరి 11 నుంచి జీ5లో తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ, మరాఠి, బెంగాలి భాషల్లో స్ట్రీమింగ్ కానున్నట్లు అఫీషియల్ అనౌన్స్‌మెంట్ ఇచ్చారు చిత్ర బృందం. థియేటర్‌లో హ్యాట్రిక్ హిట్ సొంతం చేసుకున్న ఈ మూవీ ఓటీటీలో ఎలాంటి స్పందన సొంతం చేసుకుంటుందో వేచి చూడాలి.

## భర్త సినిమాలో భార్య విలన్?

బాలీవుడ్ నటి యామీ గౌతమ్ ప్రొఫెషనల్ నటి. కెరీర్ ఆరంభం నుంచే అమ్మడు సెలక్టివ్ సినిమాలు చేస్తోంది. గ్లామర్ పాత్రలకు..బోల్డ్ కంటెంట్ కు తొలి నుంచి దూరంగానే ఉన్నారు. కానీ కెరీర్ గ్యాప్ మాత్రం రానివ్వలేదు. ఎంత సెలక్టివ్ గా ఉన్నా 15 ఏళ్ల ప్రయాణంలో చాలా సినిమాలే చేసారు. విక్కీ డోనర్, బద్లా పూర్, కాబిల్, ఉరి, బూత్ పోలీస్, దస్వీ, లాస్ట్ లాంటి చిత్రాలతో తనదైన ముద్ర వేసారు. భర్తగా దర్శకుడు ఆదిత్యధర్ జీవితంలోకి వచ్చిన తర్వాత ఆమె ప్రయాణం మరింత సెలక్టివ్ గా ఉంటుంది. హబ్బీ గొప్ప క్రియేటర్ కావడంతో పాత్రల ఎంపికలో సూచనలు సలహాలు తీసుకుంటూ కొత్త రకమైన ప్రణాన్ని సాగిస్తోంది. తాజాగా ధురంధర్ 2 లో కూడా ఎంపికైన సంగతి తెలిసిందే. మొదటి భాగంలో యామీ పాత్ర ఎక్కడా కనిపించనప్పటికీ రెండవ భాగంలో అమ్మడు నటించడం ఆసక్తికరంగా మారింది. ఈ నేపథ్యంలో యామీ గౌతమ్ పాత్ర ఎలా ఉంటుంది? హబ్బీ ఆమె కోసం ఎలాంటి రోల్ రాసాడు? అన్న దానిపై చర్చ జరుగుతోంది. అయితే, ఆ సినిమాలో యామీ నెగిటివ్ రోల్ పోషిస్తుందని సమాచారం.



## క్రిష్-4లో ప్రియాంక చోప్రా!

గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా ఇండియన్ సినిమా బాక్సాఫీస్‌పై దండయాత్రకు సిద్ధమైంది. అటు టాలీవుడ్, ఇటు బాలీవుడ్ నుంచి భారీ ప్రాజెక్టులతో ఆమె వార్తల్లో నిలిచింది. దర్శకధీరుడు రాజమౌళి, సూపర్ స్టార్ మహేష్ బాబు కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'వారణాసి'తో ఆమె టాలీవుడ్ ఇండస్ట్రీకి ఎంట్రీ ఇవ్వనుంది. ఈ సినిమాలో మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో కనిపించనుండగా, ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ సినిమాపై భారీ అంచనాలను పెంచేశాయి. ఇదిలా ఉంటే.. తాజాగా, ప్రియాంక చోప్రాకు సంబంధించిన మరో హాట్ న్యూస్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. బాలీవుడ్ సూపర్ హీరో ఫ్రాంచైజీ 'క్రిష్-4'లో ఆమె లీడ్ రోల్‌లో కనిపించనున్నట్లు టాక్ వినిపిస్తోంది. హృతిక్ రోషన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో మళ్లీ ప్రియాంకనే హీరోయిన్‌గా ఎంపిక చేసినట్లు సమాచారం. హృతిక్--ప్రియాంక జోడీగా గతంలో వచ్చిన 'క్రిష్' సిరీస్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్న నేపథ్యంలో, అదే మ్యాజిక్‌ను మరోసారి రిపీట్ చేయాలనే ఆలోచనతో మేకర్స్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాతో చాలా ఏళ్ల విరామం తర్వాత ప్రియాంక చోప్రా బాలీవుడ్‌లో గ్రాండ్ కంబ్యాక్ ఇవ్వనుంది.






## గాయపడ్డ సింహం.. తరుణ్ భాస్కర్

టాలీవుడ్ డైరెక్టర్ కమ్ యాక్టర్ తరుణ్ భాస్కర్.. తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న విషయం తెలిసిందే. ఇప్పుడు అటు సినిమాలను తెరకెక్కిస్తూ.. ఇటు లీడ్ రోల్స్ లో మూవీస్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ నగరానికి ఏమైంది మూవీ సీక్వెల్ ఈ నగరానికి ఏమైంది రిపీట్ ప్రాజెక్టుకు దర్శకత్వం వహిస్తున్న తరుణ్ భాస్కర్.. రీసెంట్ గా ఓం శాంతి శాంతి శాంతి: మూవీతో థియేటర్స్ లోకి వచ్చి మెప్పించారు. ఇప్పుడు తరుణ్ భాస్కర్ లీడ్ రోల్ లో నటిస్తున్న మరో ప్రాజెక్టు అనౌన్స్మెంట్ వచ్చింది. గాయపడ్డ సింహం టైటిల్ తో రూపొందుతున్న ఆ సినిమాకు కశ్యప్ శ్రీనివాస్ దర్శకత్వం వహిస్తున్నారు. పవన్ సాధినేని సమర్పణలో సప్తస్వ మీడియా వర్క్స్, పీవోవీ స్టోరీస్, జీ స్టూడియోస్ సంస్థలు సినిమాను సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. తాజాగా టైటిల్ పోస్టర్ ను రిలీజ్ చేశారు మేకర్స్. అయితే టైటిల్ పోస్టర్.. ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారి అందరినీ ఆకట్టుకుంటోంది. పోస్టర్ లో పాస్ పోర్ట్ స్టాంప్ స్టైల్ డిజైన్, అమెరికన్ ఫ్లాగ్ మోటిఫ్, దూసుకెళ్తున్న విమానం, డొనాల్డ్ ట్రంప్ కార్టూన్ ఇమేజ్, పాత కంపాస్ బాక్స్ వంటి ఎలిమెంట్స్.. ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దీంతో సినిమా ఇంటర్నేషనల్ బ్యాక్ డ్రాప్, సెటైరికల్ కామెడీ, క్రైమ్ ఎలిమెంట్స్ తో రూపొందుతుందని అర్థమవుతోంది.




## భారీ ఆఫర్ కోసం అనుపమ ఎదురుచూపులు

టాలీవుడ్ లో ఆల్రెడీ ఆడియన్స్‌ని ఇంప్రెస్ చేసి పాపులారిటీ తెచ్చుకున్న అనుపమ పరమేశ్వరన్ సడెన్ గా ఏమైందో ఏమో గ్రాఫ్ డౌన్ అవుతూ వచ్చింది. అలా ఊహించని విధంగా అమ్మడికి ఇక్కడ అవకాశాలు లేని విధంగా పరిస్థితి మారింది. ఒకప్పుడు యువ హీరోల సినిమాల్లో అనుపమ బెస్ట్ ఆప్షన్ అనిపించేలా చేసుకోగా రాను రాను అమ్మడు టాలీవుడ్ కి దూరం అవుతూ వచ్చింది. చివరగా తమిళ్ లో లాక్ డౌన్ సినిమా చేసిన అనుపమ ప్రస్తుతం చేతిలో సినిమాలు లేక ఖాళీగా ఉంది. తెలుగులో తనకు ఉన్న పాపులారిటీకి అవకాశాలు వచ్చే హోప్ ఉన్నా కూడా అమ్మడికి బ్యాడ్ లక్ కొనసాగుతుండటం వల్ల అవి రావట్లేదు. తమిళ్ లో అనుపమ చేస్తున్న సినిమాలకు మంచి రిజల్ట్స్ వస్తున్న కారణంగా అక్కడ ఆమెకు అవకాశాలు రావొచ్చు. ప్రస్తుతానికి అయితే తెలుగులో అనుపమకి అవకాశాలు లేవు కానీ మళ్లీ తిరిగి ఇక్కడ కూడా బిజీ అవ్వాలని చూస్తుంది అమ్మడు. కెరీర్ సెట్ రైట్ చేసుకునేందుకు ఒక భారీ తెలుగు ఆఫర్ కోసం చూస్తున్న అనుపమకి అలాంటి ఒక సినిమా పడాలని ఆమె ఫ్యాన్స్ కోరుతున్నారు.

## కాజల్ టాలీవుడ్ జర్నీ క్లోజ్?

కాజల్ అగర్వాల్ రెండు దశాబ్దాల ప్రయాణంలో దాదాపు స్టార్ హీరోలందరి సరసన నటించింది. సీనియర్ హీరోల నుంచి తర్వాత తరం సూపర్ స్టార్ల వరకూ అందర్నీ కవర్ చేసింది. అయితే, ఈ అమ్మడి కెరీర్ గత ఐదేళ్లుగా డల్‌గా సాగుతోంది. ఈ గ్యాప్ లో చేసిన రెండు చిత్రాలు చేసినా పెద్దగా పేరు రాలేదు. ప్రస్తుతం కాజల్ తెలుగులో సినిమాలు చేయలేదు. దీంతో కాజల్ టాలీవుడ్ ప్రయాణం ముగిసినట్లేనా? అన్న చర్చ ఫిలిం సర్కిల్స్ లో తెరపైకి వస్తోంది. బాలీవుడ్ లో మాత్రం రామాయణం సహా ది ఇండియన్ స్టోరీలో నటిస్తోంది.



## 'జన నాయగన్' ఫైనల్ కట్ రెడీ?

స్టార్ హీరో దళపతి విజయ్ నటించిన చివరి పొలిటికల్ యాక్షన్ డ్రామా 'జన నాయగన్' రిలీజ్ కోసం యావత్ కోలీవుడ్ ఆసక్తిగా ఎదురు చూస్తోంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన అప్ డేట్ నెట్టింట చక్కర్లు కొడుతోంది. 'జన నాయగన్' టీమ్ సీబీఎఫ్‌సీ వర్గాలు సూచించిన కట్స్‌కి, అన్ని నిబంధనలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసి కోరిన మార్పులు, చేర్పులు చేసి సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ప్లాన్ చేస్తున్నారట. ఫైనల్ కట్‌ని రెడీ చేసి సెన్సార్ కమిటీకి పంపించే పనిలో టీమ్ ముమ్మరంగా వర్క్ చేస్తోందని ఇన్ సైడ్ టాక్. త్వరలోనే ఫైనల్ కట్‌ని కమిటీకి సమర్పించి రిలీజ్ కు అప్రూవల్ పొందడానికి సిద్ధమవుతున్నట్టుగా తెలుస్తోంది. ఒకసారి ఫైనల్ కట్ వెర్షన్ పూర్తయితే ఈ మూవీ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ సీబీఎఫ్‌సీపై వేసిన పిటీషన్ బేషరతుగా వెనక్కి తీసుకునే పనిలో ఉందట. ఇలా వన్ బై వన్ అనుకున్నట్టుగా పూర్తయి సెన్సార్ వారి నుంచి క్లియరెన్స్ వచ్చేస్తే 'జన నాయగన్'ని ఫిబ్రవరి సెకండ్ వీక్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట.



ఈవార్తలు
క్రీడావాణి SPORTS
శనివారం 8-2-2026 | www.evarthalu.com | 7



## శభాష్ స్మృతి: కోహ్లీ

వుమెన్స్ ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్) 2026 సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) విజేతగా నిలవడంపై ఆ ఫ్రాంచైజీ స్టార్ ప్లేయర్, టీమిండియా మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ సంతోషం వ్యక్తం చేశాడు. శభాష్ స్మృతి మంధాన అంటూ ప్రశంసల జల్లు కురిపించాడు. ఆర్‌సీబీ జెండాను రెపరెపలాడించి, తలెత్తుకునేలా చేశారని కొనియాడాడు. ఈ విజయం నేపథ్యంలో అభిమానుల కురిపిస్తున్న ప్రేమను అక్కున చేర్చుకోవాలని సూచించాడు. గురువారం వడోదర వేదికగా జరిగిన డబ్ల్యూపీఎల్ 2026 ఫైనల్లో సమష్టిగా రాణించి ఆర్‌సీబీ 6 వికెట్ల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించింది. 204 పరుగుల రికార్డ్ లక్ష్యాన్ని ఛేదించిన ఆర్‌సీబీ సరికొత్త రికార్డ్‌ను లిఖించింది. ఇది ఆర్‌సీబీ రెండో డబ్ల్యూపీఎల్ టైటిల్ కాగా.. ఆ ఫ్రాంచైజీకి వరుసగా మూడో టైటిల్. డబ్ల్యూపీఎల్ 2024లో ఆర్‌సీబీ తొలి సారి విజేతగా నిలవగా.. ఐపీఎల్ 2025లో ఆర్‌సీబీ తొలిసారి టైటిల్ ముద్దాడింది. తాజా డబ్ల్యూపీఎల్ 2026 సీజన్‌లోనూ ఆర్‌సీబీ విజేతగా నిలవడంతో ఫ్యాన్స్‌కు హ్యాట్రిక్ టైటిల్ దక్కినట్లు అయ్యింది. ఆర్‌సీబీ సాధించిన ఈ చిరస్మరణీయ విజయంపై సోషల్ మీడియా వేదికగా స్పందించిన విరాట్ కోహ్లీ.. స్మృతి సేనను ప్రత్యేకంగా అభినందించాడు. 'మళ్లీ విజేతగా నిలిచాం. ఆర్‌సీబీ జెండాను రెపరెపలాడిస్తూ.. మీ అందరూ మేమంతా గర్వపడేలా చేశారు. ఈ విజయం సాధించిన స్మృతి మంధానతో పాటు జట్టు సభ్యులందరికీ, మేనేజ్‌మెంట్‌కు హృదయపూర్వక అభినందనలు. మీరు నిస్సందేహంగా ఈ విజయానికి అర్హులు. ఈ క్షణాన్ని ఆస్వాదించండి. మన అభిమానులుకురిపిస్తున్న ప్రేమను అక్కున చేర్చుకోండి 'అని విరాట్ కోహ్లీ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పేర్కొన్నాడు.



## హార్దిక్ కొత్త స్టైల్!

టీ20 వరల్డ్ కప్ 2026 సమరానికి కౌంట్‌డౌన్ మొదలైంది. మరికొన్ని గంటల్లోనే ఈ మెగా టోర్నీ ప్రారంభం కానుంది. ఈ క్రమంతో భారత జట్టు తన తొలి మ్యాచ్ అమెరికా జట్టుతో ముంబైలోని వాంఖడే స్టేడియంలో ఆడబోతోంది. అయితే ఈ కీలక మ్యాచ్‌కు ముందు టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా తన ఆట కంటే ముందు తన అద్భుతమైన స్టైలిష్ లుక్‌తో వార్తల్లో నిలిచాడు. సాధారణంగా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా మైదానంలో ఎంత దూకుడుగా ఉంటాడో.. మైదానం బయట అంత స్టైలిష్‌గా కనిపిస్తాడు. తాజాగా పాండ్యా తన హెయిర్ స్టైల్‌ను పూర్తిగా మార్చేశాడు. జట్టుకు 'వైట్ బ్లాండ్' (సిల్వర్ లేదా యాషీ టోన్) కలర్ వేయించుకుని సరికొత్తగా కనిపిస్తున్నాడు. బ్లీచింగ్ పద్ధతిలో చేసిన ఈ మేకోవర్‌లో పాండ్యాను ఒక్కసారిగా గుర్తుపట్టడం అభిమానులకు కష్టమవుతోంది. దీనికి సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో నిమిషాల్లోనే వైరల్ అయ్యాయి.

## పాక్‌పై నిషేధం విధించాలి: అనురాగ్ ఠాకూర్

భారత్, శ్రీలంక వేదికగా రేపటి నుంచి టీ20 ప్రపంచకప్ షురూ కానుంది. వామప్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాను చిత్తు చేసిన భారత జట్టు తొలి లీగ్ మ్యాచ్‌లో యూఎస్‌ఏతో తలపడనుంది. కానీ.. భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌పై మాత్రం అనిశ్చితి కొనసాగుతోంది. ఇండియాతో మ్యాచ్ బాయ్‌కాట్ చేస్తామని పాకిస్థాన్ ప్రభుత్వం వెల్లడించగా.. మేము ఆడేందుకు సిద్ధమే అని భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తేల్చి చెప్పాడు. ఈ నేపథ్యంలో బీసీసీఐ మాజీ అధ్యక్షుడు అనురాగ్ ఠాకూర్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. కొలంబోలో ఇండియాతో మ్యాచ్ ఆడకుంటే పాక్ జట్టుపై నిషేధం విధించాలని ఆయన పేర్కొన్నాడు. భారత్‌లో వరల్డ్‌కప్ ఆడబోమని బెట్టు చేసినందుకు బంగ్లాదేశ్‌పై వేటు పడింది. అప్పటి నుంచి ఆ దేశ క్రికెట్ బోర్డుకు మద్దతిస్తున్న పాకిస్థాన్ మెగా టోర్నీలో భారత జట్టుతో మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేస్తామని తెలిపింది. అయితే.. టీమిండియా కెప్టెన్ మాత్రం కొలంబో వెళ్లేందుకు టికెట్లు బుక్ చేసుకున్నామని.. ఫిబ్రవరి 15న పాక్‌తో మ్యాచ్‌కోసం స్టేడియానికి వెళ్తామని చెప్పాడు. శ్రీలంక బోర్డు సైతం ఇండియాతో మ్యాచ్ ఆడాలని పాక్ బోర్డుకు లేఖ రాసింది. లాహోర్ దాడిని గుర్తు చేస్తూ మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేయొద్దని కోరింది. అయినా సరే పాక్ బోర్డు స్పందించలేదు. దాంతో, ఎంపిక పద్ధతిన ప్రపంచకప్ ఆడాలనుకున్న పాక్‌పై చర్యలు తీసుకోవాలని బీజేపీ ఎంపీ, మాజీ బీసీసీఐ అధ్యక్షుడు అన్నాడు. 'భారత జట్టుతో మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేస్తామంటున్న పాకిస్థాన్‌పై ఐసీసీ కఠిన చర్యలు తీసుకోవాలి.



# పిలగాండ్లు.. ప్రపంచ వీరులు!



### విశ్వవిజేతగా భారత్-అండర్ 19.. 100 పరుగుల తేడాతో భారీ విక్టరీ

దుమ్ముదులిపాడు అంటే చీప్..
వీరవిహారం అన్నా సరిపోదు..
ఊచకోత పదమూ తక్కువే..
ఆకాశమే హద్దు అంటే.. కాస్త బెటర్
చుక్కలు చూపించాడు అంటే.. ఇంకాస్త బెటర్
వెన్నులో వణుకు పుట్టించాడంటే.. ఓ లెక్క!
బ్యాటుతో ఉగ్రతాండవం అంటే.. పర్‌ఫెక్ట్
అది కదా వైభవం.. అది కదా సూర్యప్రతాపం..
వైభవ్ సూర్యవంశీ.. అసలుసిసలైన వీరత్వం!!

**చుక్కలు చూపించిన వైభవ్ సూర్యవంశీ.. 80 బంతుల్లోనే 175 పరుగులు**

**ఫైనల్లో ఇంగ్లండ్ అండర్ 19 చిత్తు చిత్తు.. ఆరో టైటిల్‌ను ముద్దాడిన టీమిండియా**

వచ్చిన బంతి వచ్చినట్లే స్టాండ్స్‌లో ప్రత్యక్షం. బాల్ వేయడమే లేటు.. బంతి బౌండరీని తాడకమే. ఒక సిక్స్.. ఒక ఫోర్.. మళ్లీ సిక్స్.. మళ్లీ ఫోర్.. ఇలా ఒకటి కాదు, రెండు కాదు.. 15 సిక్సులు, 15 ఫోర్లు.. ఇది వైభవ్ సూర్యవంశీ వైభవోపేత ఇన్నింగ్స్. ఎహే! అక్షరాలు కూడా సరిపోవు మన బుడ్డోడి ప్రతాపం ముందు. బ్యాటుతో చేసిన తాండవం.. ఉగ్రరూపాన్నే తలపించింది. దెబ్బకు ఇంగ్లండ్ కుర్రాళ్లు బిత్తరపోయి తేలిపోయారు. వీడేంట్రా బాబూ అలా బాదుతున్నాడని తలలు పట్టుకున్నారు. ఇంకెప్పుడు అవుట్ అవుతాడోనని కండ్లు పెద్దవి చేసుకొని చూశారు. మొత్తంగా, అండర్ 19 వరల్డ్ కప్ ఫైనల్ అసలైన మజాను అందించాడు. వైభవ్ ఇన్నింగ్స్‌తో, తోటి బ్యాటర్ల సహకారంతో భారత్ స్కోరు 400 దాటింది. 50 ఓవర్లలో 411 పరుగులు చేసిన టీమిండియా.. ఇంగ్లండ్ బ్యాటర్లను 311 పరుగులకే పరిమితం చేసి, 100 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది.

అండర్ 19 ప్రపంచకప్ 2026లో టీమిండియా విజేతగా నిలిచింది. అద్వితీయమైన ప్రదర్శనతో ఆరో టైటిల్‌ను ముద్దాడింది. ఇంగ్లండ్‌తో గురువారం జరిగిన ఫైనల్లో సమష్టిగా రాణించిన భారత్ 100 పరుగుల తేడాతో గెలుపొందింది. బ్యాటింగ్‌లో వైభవ్ సూర్యవంశీ, బౌలింగ్‌లో అంబ్రిష్ సత్తా చాటి భారత విజయంలో కీలక పాత్ర పోషించారు. 2022 ఎడిషన్ తర్వాత టీమిండియా విజేతగా నిలిచింది. అప్పుడు కూడా ఇంగ్లండ్‌పైనే భారత్ విజయం సాధించడం గమనార్హం. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత అండర్ 19 టీమ్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లకు 411 పరుగుల భారీ స్కోర్ చేసింది. వైభవ్ సూర్యవంశీ(80 బంతుల్లో 15 ఫోర్లు, 15 సిక్సలతో 175) విధ్వంసకర శతకంతో చెలరేగగా.. కెప్టెన్ ఆయుష్ మాత్రే(51 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సలతో 53) హాఫ్ సెంచరీ సాధించాడు. అభిజ్ఞాన్ కుండు(40), విహాన్ మల్హోత్రా(30), వేదాంత్ త్రివేది(32), కాన్షిక్(37 నాటౌట్) దూకుడుగా ఆడారు. ఇంగ్లండ్ బౌలర్లలో సెబాస్టియన్ మోర్గాన్, అలెక్స్ గ్రీన్ రెండేసి వికెట్లు తీయగా.. జేమ్స్ మింటో(3/63) మూడు వికెట్లు పడగొట్టాడు. మన్నీ లమ్స్‌డెన్ ఒక వికెట్ తీసాడు. అనంతరం ఇంగ్లండ్ 40.2 ఓవర్లలో 311 పరుగులకు ఆలౌటైంది. ఇంగ్లండ్ బ్యాటర్లలో కాలెబ్ ఫాల్కోనర్(67 బంతుల్లో 9 ఫోర్లు, 7 సిక్సలతో 115) సెంచరీతో రాణించినా.. బెన్ డాకిన్స్(56 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సలతో 66) హాఫ్ సెంచరీతో సత్తా చాటినా ఫలితం లేకపోయింది. భారత బౌలర్లలో అంబ్రిష్(3/56) మూడు వికెట్లు తీయగా.. దీపేష్ దేవంద్రన్(2/64), కాన్షిక్ చౌహాన్(2/63) రెండేసి వికెట్లు తీయగా.. ఖిలాన్ పటేల్, ఆయుష్ మాత్రే తలో వికెట్ తీసారు. ఇప్పటి వరకు ఈ టోర్నీలో 10 ఫైనల్స్ ఆడిన టీమిండియా 6 సార్లు విజేతగా నిలిచింది. 2000, 2008, 2012, 2018, 2022, 2026లో భారత్ విజేతగా నిలిచింది. విధ్వంసకర శతకంతో చెలరేగిన 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీకి ప్లేయర్ ఆఫ్ ది టోర్నీతో పాటు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు దక్కింది. అయితే అండర్ 19 ప్రపంచకప్ జట్టులో విజేతగా నిలిచిన జట్టుకు ఎలాంటి ప్రైజ్‌మనీ లభించదు. ఈ టోర్నీని కేవలం యువ ఆటగాళ్ల ప్రతిభను గుర్తించే వేదికగా ఐసీసీ పరిగణిస్తుంది. కమర్షియల్ ఆదాయం కంటే క్రీడా స్ఫూర్తికి ఇక్కడ ప్రాధాన్యం ఇస్తారు. కేవలం ఐసీసీ ట్రోఫీని మాత్రమే అందజేస్తారు.



## వైభవ్ దంచుడే దంచుడు

టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ(80 బంతుల్లో 15 ఫోర్లు, 15 సిక్సలతో 175) విధ్వంసకర శతకంతో సత్తా చాటాడు. అండర్ 19 ప్రపంచకప్ 2026లో భాగంగా ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఫైనల్లో 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. 218.75 స్ట్రైక్‌రేట్‌తో ఇంగ్లండ్ బౌలర్లను ఊచకోత కోసాడు. 15 సిక్సర్లు, 15 ఫోర్లతో 30 బంతుల్లోనే 150 పరుగులు చేశాడు. అతని విధ్వంసానికి ఇంగ్లండ్ కుర్రాళ్లు బిత్తరపోయారు. ఎప్పుడు ఔటవుతార్రా బాబు అని తలలు పట్టుకున్నారు. ఈ మ్యాచ్‌లో 32 బంతుల్లోనే హాఫ్ సెంచరీ బాదిన వైభవ్ సూర్యవంశీ.. 55 బంతుల్లోనే సెంచరీ మార్క్ అందుకున్నాడు. 71 బంతుల్లోనే 150 పరుగులు సాధించాడు. ఈ మ్యాచ్‌లో తొలి 50 పరుగులకు 32 బంతులు తీసుకున్న వైభవ్ సూర్యవంశీ.. రెండో యాభై 23 బంతుల్లోనే పూర్తి చేశాడు. 16 బంతుల్లోనే మూడో యాభైని పూర్తి చేశాడు. డబుల్ సెంచరీ దిశగా సాగిన వైభవ్ సూర్యవంశీ ఇంగ్లండ్ బౌలర్ మన్నీ లమ్స్‌డెన్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో ఇంగ్లండ్ బౌలర్లు ఊపిరి పీల్చుకున్నారు. పెవిలియన్ వైపు నడిచిన వైభవ్ సూర్యవంశీ.. వైభవ్ సూర్యవంశీ ధాటికి ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత అండర్ 19 టీమ్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లకు 411 పరుగుల భారీ స్కోర్ చేసింది. వైభవ్‌కు తోడుగా కెప్టెన్ ఆయుష్ మాత్రే(51 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సలతో 53) హాఫ్ సెంచరీ సాధించగా.. అభిజ్ఞాన్ కుండు(40), విహాన్ మల్హోత్రా(30), వేదాంత్ త్రివేది(32), కాన్షిక్(37 నాటౌట్) దూకుడుగా ఆడారు.



## పొట్టి కప్ వేట షురూ!

**నేటి నుంచి టీ20 వరల్డ్ కప్**

**నేడు రాత్రి అమెరికాతో తో భారత్ ఢీ**

టీ20 క్రికెట్‌లో మరో ప్రపంచకప్ పోరుకు సమయం ఆసన్నమైంది. పొట్టి కప్‌లో సత్తా చాటేందుకు 20 జట్లు సిద్ధమయ్యాయి. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ టోర్నీలో జరగబోయే హోరాహోరీ సమరాలు ఆసక్తి రేపుతున్నాయి. బంగ్లాదేశ్ నిష్క్రమణ.. భారత్‌తో మ్యాచ్ పాక్ బహిష్కరణ నేపథ్యంలో జరుగుతున్న ఈ మెగా టోర్నీపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. హిస్టరీ రిపీట్.. హిస్టరీ డిఫీట్ అనే నినాదంతో డిఫెండింగ్ ఛాంపియన్ టీమిండియా బరిలోకి దిగుతోంది. ఆదివారం శ్రీలంకలోని కొలంబో వేదికగా పాకిస్థాన్, నెదర్లాండ్స్ మధ్య జరిగే తొలి మ్యాచ్‌తో ఈ మెగా టోర్నీకి తెరలేవనుంది. రోజుకు మూడు మ్యాచ్‌లు అభిమానులను అలరించనున్నాయి. ఆదివారం రాత్రి 7 గంటలకు అమెరికాతో తో ప్రారంభమయ్యే మ్యాచ్‌తో భారత్ తమ క్యాంపైన్‌ను ప్రారంభించనుంది. ఫామ్, ట్రాక్ రికార్డ్ చూసుకున్నా టీడిండియా హాట్ ఫేవరేట్‌గా కనిపిస్తోంది. గత రెండేళ్లుగా టీమిండియా ఒక్క టీ20 సిరీస్ కూడా ఓడిపోలేదు. టీ20 ప్రపంచకప్ 2026 చరిత్రలోనే ఇప్పటి వరకు ఏ ఆతిథ్య జట్టు టైటిల్ గెలవలేదు. అంతేకాకుండా ఏ టీమ్ కూడా వరుసగా రెండో టైటిల్ అందుకోలేదు. ఈ చరిత్రను తిరగరాయలనే పట్టుదలతో భారత్ ఉంది. గత ప్రపంచకప్ విజయాన్ని పునరావృతం చేస్తూ.. గత చరిత్రను తిరగరాయలనే లక్ష్యంతో టీమిండియా ఉంది. ఈ క్రమంలోనే హిస్టరీ రిపీట్.. హిస్టరీ డిఫీట్ అనే నినాదంతో బరిలోకి దిగుతోంది. ఏ లెక్కన చూసుకున్నా భారత్ ముందు పసికూన అమెరికా ఏ మాత్రం పోటీ కాదు. కానీ ఎంత మేర పోటీనిస్తుంది? అనేది చూడాలి.

# ప్రైవేట్ దోపిడీకి 'భారత్' చెక్!

దేశంలోని రవాణా రంగంలో గత దశాబ్ద కాలంగా యాప్ ఆధారిత క్యాబ్ సంస్థల హవా నడుస్తోంది. సౌలభ్యం పేరుతో ప్రవేశించిన ఈ ప్రైవేట్ దిగ్గజాలు, క్రమంగా అటు ప్రయాణికులను, ఇటు డ్రైవర్లను తమ గుత్తాధిపత్యంతో ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన 'భారత్ టాక్సీ' ఒక ఆశాకిరణంలా కనిపిస్తోంది. "సారథే యజమాని" (సారథి హి మాలిక్) అనే నినాదంతో, సహకార రంగం ద్వారా రూపుదిద్దుకున్న ఈ వేదిక కేవలం ఒక యాప్ మాత్రమే కాదు, అసంఘటిత రంగంలోని కార్మికుల ఆర్థిక స్వేచ్ఛకు ఒక నాంది. ఓలా, ఊబర్ వంటి ప్రైవేట్ సంస్థలు డ్రైవర్ల కష్టార్జితంలో 20 నుంచి 40 శాతం వరకు కమీషన్ రూపంలో వసూలు చేస్తున్నాయి. దీనికి తోడు 'సర్జ్ ప్రైసింగ్' పేరుతో రద్దీ సమయాల్లో ప్రయాణికుల నుంచి రెట్టింపు ఛార్జీలు వసూలు చేయడం పరిపాటిగా మారింది. అల్గారిథమ్స్ సృష్టించే ఈ కృత్రిమ ధరల భారంతో సామాన్యుడు విలవిలలాడుతుంటే, సంస్థల ఖజానాలు మాత్రం నిండుతున్నాయి. డ్రైవర్లకు కనీస సామాజిక భద్రత లేదు, పైగా నిరంతరం పెరిగే ఇంధన ధరలు, వాహన నిర్వహణ ఖర్చులతో వారు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. భారత్ టాక్సీ ఈ దోపిడీకి ముగింపు పలికేలా 'జీరో కమీషన్' నమూనాను ప్రవేశపెట్టింది. ప్రతి ట్రిప్పుపై కమీషన్ తీసుకునే బదులు, రోజుకు కేవలం రూ. 30 (క్యాబ్స్) లేదా రూ. 18 (ఆటోలు) చందాగా నిర్ణయించడం సాహసోపేతమైన నిర్ణయం. దీనివల్ల ప్రయాణికులకు ఛార్జీలు దాదాపు 30 శాతం వరకు తగ్గే అవకాశం ఉంది. ముఖ్యంగా, ఎటువంటి 'సర్జ్ ప్రైసింగ్' ఉండదని ప్రకటించడం ప్రయాణికులకు పెద్ద ఊరట. సహకార నమూనాలో డ్రైవర్ కేవలం ఒక పనివాడు కాదు, ఆ సంస్థలో భాగస్వామి. ప్రతి డ్రైవర్‌కు రూ. 5 లక్షల ప్రమాద బీమా, రూ. 5 లక్షల ఆరోగ్య బీమా కల్పించడం అభినందనీయం. సంస్థ వచ్చే లాభాల్లో డివిడెండ్లు పొందడం ద్వారా డ్రైవర్లు ఆర్థికంగా బలోపేతం అవుతారు. ఇతర యాప్‌లతో కూడా పనిచేసుకునే వెసులుబాటు కల్పించడం ద్వారా వారి ఉపాధికి అడ్డులేకుండా చేశారు. కేవలం లాభాపేక్షే ధ్యేయంగా పనిచేసే ప్రైవేట్ సంస్థలకు 'భారత్ టాక్సీ' ఒక గట్టి హెచ్చరిక. అయితే, కేవలం ప్రారంభించడమే కాదు, సాంకేతిక సమస్యలు లేకుండా యాప్‌ను నిర్వహించడం, కస్టమర్ కేర్‌ను పటిష్టం చేయడం, దేశవ్యాప్తంగా విస్తరించడంపై దీని విజయం ఆధారపడి ఉంటుంది. గిగ్ ఎకానమీలో కార్మికుల దోపిడీని అరికట్టడానికి ప్రభుత్వ అండతో కూడిన ఈ సహకార నమూనా దేశవ్యాప్తంగా సఫలమైతే, అది రవాణా రంగంలోనే కాక, ఆర్థిక వ్యవస్థలోనూ కొత్త చరిత్రను లిఖిస్తుంది.

**– ఈవార్తలు సంపాదకీయ విభాగం**






# క్వాంటం వ్యాలీ..
# భారత్‌కు నవశకం

> అమరావతి సాక్షిగా సాంకేతిక విప్లవం నిన్నటి వరకు మనం బిట్స్ (0 లేదా 1) ఆధారిత కంప్యూటర్ల ప్రపంచంలో ఉన్నాం. కానీ నేటి ప్రపంచం 'క్వాంటం' మయం. సాధారణ కంప్యూటర్లు కొన్ని వేల ఏళ్లు పట్టే గణనలను, క్వాంటం కంప్యూటర్లు కేవలం కొన్ని సెకన్లలోనే పూర్తి చేస్తాయి. ఈ సామర్థ్యాన్ని ఒడిసిపట్టుకోవడానికి అమరావతిలో 50 ఎకరాల్లో నిర్మిస్తున్న 'క్వాంటం వ్యాలీ', భారతదేశాన్ని ప్రపంచ పటంలో 'డీప్-టెక్' హబ్‌గా నిలబెట్టనుంది. క్వాంటం కీ డిస్ట్రిబ్యూషన్ ద్వారా హ్యాకింగ్‌కు గురికాని సమాచార వ్యవస్థను నిర్మించవచ్చు. ఇది దేశ రక్షణ రంగంలో సరికొత్త భద్రతా వలయాన్ని సృష్టిస్తుంది. 2030 నాటికి ప్రపంచంలోని టాప్ 5 క్వాంటం హబ్‌లలో ఒకటిగా అమరావతిని నిలపాలన్నది లక్ష్యం.

దీనివల్ల విదేశీ పెట్టుబడులు వెల్లువెత్తుతాయి. క్వాంటం అల్గారిథమ్స్ ద్వారా కొత్త ఔషధాల తయారీ, కచ్చితమైన వాతావరణ ముందస్తు హెచ్చరికలు సాధ్యమవుతాయి. ఇది రైతులకు, వైద్య రంగానికి వరం. ఏదైనా కొత్త సాంకేతికతతో కూడిన భారీ ప్రాజెక్టుకు సమస్యలు సహజం. క్వాంటం కంప్యూటర్లు పని చేయడానికి అత్యంత శీతల వాతావరణం అవసరం. వీటిని నిర్వహించడం వ్యయప్రయాసలతో కూడిన పని. ఈ ప్రాజెక్టు విజయవంతం కావాలంటే 2029 నాటికి సుమారు 1 బిలియన్ డాలర్ల పెట్టుబడులు అవసరం. ప్రభుత్వంతో పాటు ప్రైవేట్ భాగస్వాములు (ఐబీఎం, టీసీఎస్, ఎన్‌విడియా వంటివి) దీర్ఘకాలం నిలకడగా పెట్టుబడులు పెట్టాల్సి ఉంటుంది. అమెరికా, చైనా, ఐరోపా దేశాలు ఇప్పటికే ఈ రంగంలో చాలా ముందున్నాయి. వాటిని అధిగమించి 'గ్లోబల్ లీడర్'గా ఎదగడం ఒక సవాల్. యువతకు ఈ ప్రాజెక్టు అతిపెద్ద ఆశ కిరణం. ప్రభుత్వం అంచనా ప్రకారం, క్వాంటం వ్యాలీ ద్వారా రాబోయే ఏళ్లలో సుమారు 1,00,000 మంది నిపుణులకు ఉపాధి దొరుకుతుంది. 'అమరావతి క్వాంటం అకాడమీ' ద్వారా ఇప్పటికే 50,000 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చే ప్రక్రియ ప్రారంభమైంది. ఇది కేవలం ఐటీ ఉద్యోగాలకే పరిమితం కాకుండా రిసెర్చ్ స్కాలర్లు, హార్డ్‌వేర్ ఇంజనీర్లు మరియు సాఫ్ట్‌వేర్ డెవలపర్లకు 'హై-వాల్యూ' ఉద్యోగాలను కల్పిస్తుంది. అది భారతీయ యువత మేధస్సుకు ఒక పరీక్షా వేదిక. రాజకీయ స్థిరత్వం, సాంకేతిక తోడ్పాటు, నిరంతర పరిశోధనలు తోడైతే, సిలికాన్ వ్యాలీకి సరైన పోటీదారుగా అమరావతి నిలబడటంలో సందేహం లేదు.

**- వీఆర్ వాసు, విజయవాడ, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్**

# ధర్మ రక్షణ యువత బాధ్యత



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ 'హిందూ ధర్మాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత' అని చేసిన వ్యాఖ్యలు తెలుగు రాష్ట్రాల్లోనే కాక, దేశవ్యాప్తంగా చర్చకు దారితీస్తున్నాయి. రాజకీయాలకు అతీతంగా, ఒక వ్యక్తిగా ఆయన తన మూలాలను వెతుక్కుంటూ చేస్తున్న ప్రయాణం నేటి యువతకు ఒక దిక్సూచిగా కనిపిస్తోంది. ఆధునికత పేరుతో మనం మన మూలాలను మర్చిపోతున్న తరుణంలో, ధర్మం అంటే కేవలం పూజలు, పునస్కారాలు మాత్రమే కాదని, అది ఒక జీవన విధానమని గుర్తుచేశారు. చాలామంది యువతీ యువకులు 'ధర్మం' అనగానే దానిని ఒక సంకుచితమైన మతంగానో, లేదా పాతకాలపు పద్ధతులుగానో భావిస్తారు. కానీ సనాతన ధర్మం అంటే 'నిత్య నూతనం'. మతం అంటే ఒకే పుస్తకం, ఒకే ప్రవక్త చుట్టూ తిరిగేది. కానీ ధర్మం అంటే బాధ్యత. అది విశ్వజనీనమైనది. హిందూ ధర్మం ఎప్పుడూ విజ్ఞానానికి, శాస్త్రానికి అడ్డు నిలవలేదు. ఉపనిషత్తుల దగ్గర నుంచి నేటి యోగా వరకు అన్నీ తర్కబద్ధమైనవే. ఈ విషయాన్ని యువత గ్రహించాల్సిన అవసరం ఉంది. నేటి వేగవంతమైన ప్రపంచంలో యువత తీవ్రమైన మానసిక ఒత్తిడికి, గందరగోళానికి గురవుతున్నారు. ఇక్కడ హిందూ ధర్మం ఒక పరిష్కారంలా కనిపిస్తుంది. యోగా, ధ్యానం అనేవి కేవలం శారీరక వ్యాయామాలు కావు. అవి మనస్సును అదుపులో ఉంచే అద్భుతమైన ఆయుధాలు. నేడు సమాజంలో విలువలు పడిపోతున్నాయి. రామాయణంలోని పితృవాక్య పరిపాలన, మహాభారతంలోని ధర్మ రక్షణ వంటివి నేటి కార్పొరేట్ ప్రపంచంలో కూడా 'నైతిక నాయకత్వానికి' మార్గదర్శకాలు. నదులను తల్లులుగా, చెట్లను దైవాలుగా పూజించే ఏకైక సంస్కృతి మనది. గ్లోబల్ వార్మింగ్ కాలంలో ప్రకృతిని ప్రేమించడం కంటే పెద్ద ధర్మం మరొకటి లేదు. ఒక జాతి తన అస్తిత్వాన్ని కోల్పోతే, అది భవిష్యత్తులో దిక్కులేనిది అవుతుంది. యువత తమ సంస్కృతిని గర్వంగా చెప్పుకోలేనప్పుడు, ఇతర సంస్కృతుల దాడికి గురవుతారు. హిందూ ధర్మం సహనాన్ని బోధిస్తుంది, కానీ అది చేతకానితనం కాదు. అన్యాయం జరిగినప్పుడు ప్రశ్నించడం, ధర్మాన్ని రక్షించడం కూడా ధర్మంలో భాగమే. ధర్మం గురించి మాట్లాడగానే కొంతమంది దానిని 'మతతత్వం'గా ముద్ర వేస్తారు. కానీ హిందూ ధర్మం "వసుధైవ కుటుంబకం" (ప్రపంచమంతా ఒకే కుటుంబం) అని చెబుతుంది. సోషల్ మీడియాలో సనాతన ధర్మంపై జరుగుతున్న తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టే విజ్ఞానం యువత సంపాదించాలి. శాస్త్రీయంగా మన సంస్కృతి గొప్పతనాన్ని నిరూపించాలి. కులమతాల కతీతంగా అందరూ భారతీయులే అన్న భావన కలిగించడమే నిజమైన ధర్మం. హిందూ ధర్మాన్ని కాపాడుకోవడం అంటే కేవలం నినాదాలు చేయడం కాదు, అది ఆచరణలో ఉండాలి. భగవద్గీత లేదా ఉపనిషత్తులను కనీసం ఒక్కసారైనా చదవండి. అవి మత గ్రంథాలు కావు, జీవన శైలిని నేర్పే పాఠాలు. సంస్కృతం, తెలుగు వంటి భాషలు మన సంస్కృతికి వాహకాలు. మన భాషను మనం గౌరవించుకుందాం. దేవాలయాలు కేవలం మొక్కులు తీర్చుకునే చోటు కాదు, అవి శిల్పకళకు, చరిత్రకు మరియు శక్తికి నిలయాలు. వాటి ప్రాశస్త్యాన్ని తెలుసుకోవాలి. ఎవరైనా మన సంస్కృతిని హేళన చేసినప్పుడు కోపంతో కాదు, జ్ఞానంతో, తర్కంతో సమాధానం చెప్పగలగాలి. 'ధర్మాన్ని మనం రక్షిస్తే, ఆ ధర్మం మనల్ని రక్షిస్తుంది' – ఇది సత్యం. అభివృద్ధి పథంలో దూసుకుపోతూనే, మన మూ లాలను మర్చిపోకుండా ఉండటమే నిజ మైన ప్రగతి. మన వారసత్వం మన గర్వం.



**కొత్తకోట శివానందస్వామి**

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!

పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.